

తల్లుల బ్యాంక్ ఖాతాలో సొమ్ములు జమ

తల్లికి ఆనందం

Your A/c.XXXX3826 is credited with Rs.39,000.00 on 13/06/2025 06:30. Avbl bal Rs. 40,370.54 - SGBANK

ముందుగా చెప్పినట్లు పిల్లలందరికీ సొమ్ములు వేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఒక ఇంట్లో ముగ్గురు ఉన్నా ఒకరికే ఇచ్చేవారు. ఆఖరికి బూట్లు, యూనిఫాం, బ్యాగ్ నాణ్యత లేనివి ఇచ్చేవారు. కొద్దికాలానికే అవి పాడైపోయాయి. ఇప్పుడు మాత్రం లోకేశ్ చొరవతో సక్రమంగా జరుగుతున్నట్లు తెలుస్తోందని ఏలూరుకు చెందిన సాంబశివరావు ఆనందం.

చంద్రబాబు ఇచ్చిన మాట తప్పలేదు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామని చెప్పినట్లు సొమ్ములు జమ కావడం నిజంగా అద్భుతం. చంద్రన్న మీరు చల్లగా ఉండాలని హసీనా బేగం దీవించారు.

- వేలాది కుటుంబాల్లో సంబరాలు
- మారుమూల గ్రామాల్లోనూ వందనం
- కొందరికి సొమ్ములు జమ కాక నిరాశ
- వివరణ ఇచ్చేవారు లేక తల్లుల ఆందోళన

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లా వ్యాప్తంగా వేలాది కుటుంబాల్లో అంతులేని ఆనందం. ఎంతమందిని చదివిస్తే అంతమంది తల్లులకు తెలుగుదేశం సర్కారు వందనం వేసింది. తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ చేసింది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆనందం నింపింది. తల్లికి వందనం పథకంలో తల్లుల ఖాతాల్లో సొమ్ములు ఎప్పుడు జమ అవుతాయని చాన్నాళ్లుగా ఎదురు చూస్తున్నారు. బడులు తెరిచిన రోజే తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామంటూ తన మాటను సీఎం చంద్రబాబు అక్షరాల రుజువు చేశారు. జిల్లాలో ఎక్కడికక్కడ తమ ఖాతాలను చూసుకున్నారు. కొందరు ఆనందంతో పొంగిపోతే, ఇంకొందరు నిరాశ చెందారు. సంబంధిత శాఖాధికారులు మాత్రం అయోమయానికి గురవుతున్న తల్లులకు వివరణ ఇచ్చేందుకు కూడా సిద్ధం కాలేకపోయారు.

ఒకప్పుడు ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉన్నా ఒకరికి మాత్రమే తల్లుల ఖాతాలో సొమ్ములు జమ అయ్యేవి. సవాలక్ష తనిఖీలతో ఖాతాలో సొమ్ము వేయడానికి ముప్పతిప్పలు పెట్టేవారు. చదువును ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులను సమయాత్తపరిచేందుకు, పిల్లలను బడి బాట పట్టించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమల్లోకి తెచ్చింది. ఎన్నికల సమయంలో ఒకటో తరగతి నుంచి ఎంతమంది చదువుతున్నా అంతమందికి తల్లికి వందనం పేరిట రూ.15 వేలు జమ చేస్తామని కూటమి నేతలంతా హామీ నిచ్చారు. అందుకు అనుగుణంగానే కొన్నాళ్ల పాటు ప్రభుత్వ ప్రకటనల కోసం ఎదురుచూస్తూ వచ్చారు. ప్రత్యేకించి మారుమూల పల్లెల్లో విద్యార్థుల తల్లిదండ్రులంతా తమ పిల్లలకు వారి ఖాతాలో జమ అవుతాయని ఎదురుచూశారు. పల్లెలకు వస్తున్న రాజకీయ పెద్దలను ఆరా తీస్తూవచ్చారు. బడులు తెరిచిన నాడే తల్లికి వందనం సొమ్ములు తల్లుల ఖాతాలో జమ అవుతాయని సీఎం చంద్రబాబు స్పష్టం చేస్తూ వచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రం గా ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం తల్లుల ఖాతాలో సొమ్ములు జమ చేసి తీరుతామని స్పష్టం చేస్తూ వచ్చారు. దీనికి అనుగుణంగానే శుక్రవారం నాటికి చాలామంది తల్లుల ఖాతాల్లో ఒక్కొక్క విద్యార్థికి రూ.13 వేలు చొప్పున డబ్బులు జమ అయ్యాయి.

మిగతా 8వ పేజీలో..



పిల్లలను బాగా చదివించుకుంటాను

నాకు ముగ్గురు కొడుకులు. జగన్ ప్రభుత్వంలో ఒక్కరికే అమ్మఒడి రూ.13వేలు ఇచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నా ముగ్గురు కొడుకులకు రూ.39 వేలు ఖాతాలో జమ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు. పిల్లలను బాగా చదివించుకుంటాను.

- నసీమ బేగం, శివగోపాలపురం



ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానం మేరకు నా ముగ్గురు పిల్లలకు రూ.39వేలు బ్యాంకులో వేశారు. నాకు ఒక బాబు, ఇద్దరు ఆడపిల్లలు. 10వ తరగతి, 8వ తరగతి, 6వ తరగతి చదువుతున్నారు. పిల్లల చదువుకు ఎన్నో ఇబ్బందులుపడుతున్నాం. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- ఎండీ రషీద, ఏలూరు



ముగ్గురు పిల్లలకు నగదు జమ

మా ముగ్గురు పిల్లలు చినపరాల రాము, ఐశ్వర్య, రాధకు తల్లికి వందనం పథకంలో భాగంగా రూ.39వేలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. గతంలో ఒకరికి మాత్రమే అమ్మఒడి సాయం అందేది. ఈ ప్రభుత్వంలో ముగ్గురు పిల్లలకు ఆర్థిక సాయం అందడంతో పిల్లలను బాగా చదివించుకోవచ్చని ఆనందంగా ఉంది. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- చినపరాల శ్రీను, సుజాత, కుక్కునూరు



ఆనందంగా ఉంది

కూలిపని చేసుకుంటూ ముగ్గురు పిల్లల్ని చదివించాలంటే కష్టంగా ఉంది. ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరిట బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో ఎంతో సంతోషపడ్డాం. పిల్లల చదువుకు ఇబ్బందులు తీరిపోయాయి. జగన్ ప్రభుత్వంలో ఒక్కరికే అమ్మఒడి పథకంలో రూ.13వేలు వేశారు. అండగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- పైలా జ్యోతి, లంకపేట



ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. కుటుంబంలో పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు చేసి చూపించారు. మాకు ముగ్గురు కుమార్తెలు. ఇవాంజలి, కృపాంజలి 6వ తరగతి, చిన్న కుమార్తె పుష్పాంజలి 2వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గత ప్రభుత్వం ఒక్కరికి మాత్రమే నగదు ఇచ్చింది. చంద్రబాబు ప్రభుత్వం ఒక్కొరికి రూ.13వేలు చొప్పున ముగ్గురికి రూ.39 వేలు నగదు జమ చేయడం సంతోషంగా ఉంది. పిల్లల అవసరాలకు నగదు ఉపయుక్తంగా ఉంటుంది. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- కలపాల ప్రశాంతి, ఎస్సీ కాలనీ, ముసునూరు



నా శివుడి అనుమతి లేనిదే..

- అలరించిన బాలకృష్ణ అఖండ-2 డైలాగ్
- సంయుక్త మీనన్‌తో కలిసి ఏలూరులో సందడి..

ఏలూరు రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి):'నా శివుడు అనుమతి లేనిదే ఆ యముడు కూడా కన్నెత్తి చూడడు. నువ్వు చూస్తావా.. అమాయకుల ప్రాణాలు తీస్తావా..' అంటూ బాలకృష్ణ తాను నటించిన అఖండ-2 సినిమా డైలాగ్‌ను పలికి అభిమానులను అలరించారు. ఈ టీజర్ విడుదలైన 26 నిమిషాల్లోనే మూడు లక్షల మందికి పైగా ప్రజలు వీక్షించి రికార్డు సృష్టించారని అన్నారు. సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం ఏలూరులో సందడి చేశారు. కొత్త బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన వేగ జ్యువెలర్స్ షోరూమ్‌ను సినీ నటి సంయుక్త మీనన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి బాలకృష్ణ అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఏలూరుతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. మా బంధువులు పెదపాడు మండలం నాయుడుగూడెంలో ఉన్నారు. అలాగే నన్ను చూసేందుకు వచ్చిన మీరంతా నా బంధువులే. ఎన్టీఆర్ కడుపున పుట్టడం నా అదృష్టం. ఆయనే బతికుంటే తెలుగు చలనచిత్ర రంగంలో ఇంకా హీరోగానే ఉండేవారు. ఆయన కారణజన్ముడు. సినిమాలతోపాటు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నా. కేంద్ర ప్రభుత్వం నాకు పద్మభూషణ్ ఇవ్వడం గర్వంగా ఉంది. మీ అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటా' అంటూ చెప్పారు. అభిమానుల కేరింతలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.



కొమ్మరలో టీడీపీలో చేరిన వారితో గోపాపురం ఎమ్మెల్యే మద్దిపాటి

వైసీపీ నుంచి వలస

ద్వారకాతిరుమల మండలంలో వంద మంది టీడీపీలో చేరిక

ద్వారకాతిరుమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమంతో పాటు నియోజకవర్గ ప్రజలకు నేనున్నానని భరోసా ఇచ్చారు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు. మండలంలోని కొమ్మర, కోడిగూడెం గ్రామాల్లో శుక్రవారం వైసీపీ నుంచి పలువురు కార్యకర్తలు టీడీపీకి వలస వచ్చారు. తాండ్ర సురేష్ బాబు నేతృత్వంలో దాదాపు వంద మందికి పైబడి కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మద్దిపాటి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేయడమే తన లక్ష్యమని స్పష్టం చేసారు. తనవంతుగా అందరికీ అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వ పని తీరును చూసి వైసీపీ నుంచి నేతలు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారని, తమ పార్టీలో చేరేందుకు ఆశక్తి చూపుతున్నట్లు చెప్పారు.



సూపర్ సిక్స్‌లో మరో హామీ అమలు : మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో మరో హామీ తల్లికి వందనం అమలు చేశామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా కుటుంబంలో ఒక విద్యార్థికే ఆర్థిక సాయాన్ని పరిమితం చేయకుండా ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ కుటుంబంలో ఎంత మంది విద్యార్థులున్నా ప్రభుత్వ సాయం అందిస్తుందన్నారు. జిల్లాలో అర్హులైన 2,15,082 అర్హులైన విద్యార్థులకు రూ.13 వేలు చొప్పున 1,40,764 తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందన్నారు. శుక్రవారం నుంచి తల్లుల ఖాతాలలో సొమ్ము జమ ప్రక్రియ ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు. విద్యార్థులకు తల్లికి వందనం ఆసరాగా నిలుస్తుందన్నారు. పాఠశాల పారిశుధ్యం, నిర్వహణకు రూ.2వేలు మినహాయించి రూ.13వేలు చొప్పున జమ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారం చేపట్టిన ఏడాదిలోనే తల్లికి వందనం నిధులు అందాయని హర్షం వ్యక్తం చేశారు.

తల్లుల వివరాలు అప్‌డేట్ చేయండి

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకానికి సాంకేతిక సమస్యల వల్ల జిల్లాలో 1592 మంది అనర్హుల జాబితాలో ఉన్నారు. ప్రభుత్వం శుక్రవారం ఈ జాబితాను జిల్లా విద్యాశాఖకు పంపింది. ఆధార్ లేదా ఫోన్ నంబర్లలో అస్పష్టత వల్ల నగదు జమ చేయడానికి ఆటంకంగా ఉందన్నారు. తక్షణం అప్‌డేట్ చేయాలని ఆదేశించింది. మండలాలవారీగా జాబితాను పంపించామని, ఎంఈవోలు వీటిని అప్‌డేట్ చేస్తారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

నేటితో ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ ముగింపు

ఏలూరు అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ ఎస్జీటీలకు జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహిస్తున్న మాన్యువల్ కౌన్సెలింగ్ శుక్రవారం కొనసాగింది. మొత్తం 800 మంది ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించగా, రాత్రి ఎంత ఆలస్యమైనా పూర్తి చేస్తామని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. జాబితాలోని చివరి ఉపాధ్యాయుని వరకు శనివారం బదిలీ కౌన్సెలింగ్‌ను చేపట్టి, మొత్తం బదిలీల ప్రక్రియను ముగిస్తామని వివరించారు. తప్పనిసరి బదిలీ టీచర్లు మినహా, రిక్వెస్టు బదిలీ కింద దరఖాస్తు చేసుకున్న వారంతా సీనియార్టీ నంబరు 1100 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంచి స్థానాలు లేకపోవడంతో అత్యధికులు బదిలీ వద్దని అన్‌విల్లింగ్ ఇచ్చి వెనుతిరిగారు.

డీఎస్సీ పరీక్షలకు 22 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన పరీక్షకు 22మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం షిఫ్టునకు 180మంది అభ్యర్థులకు 171మంది, మధ్యాహ్నం 180మందికి 177మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం 200మందికి 194, మధ్యాహ్నం 200మందికి 196మంది అభ్యర్థులు హాజరయ్యారు.

జేఎన్‌వీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు (2026-27) ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తు చేయడానికి జూలై 29వరకు గడువు ఉందని డీఈవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. జేఎన్‌వీ ఎస్‌టీ-2026 ప్రవేశ పరీక్ష ఈ ఏడాది డిసెంబరు 13న జరుగుతుందన్నారు. కేంద్రీయ సిలబస్‌తో అత్యున్నత ప్రమాణాలతో విద్య, హాస్టల్ వసతి, అన్ని సౌకర్యాలు నవోదయ విద్యాలయాల్లో లభిస్తాయన్నారు. పరీక్షకు జిల్లా నుంచి ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా ఎంఈవోలు, హెచ్‌ఎంలు ప్రోత్సహించాలన్నారు.

స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా రాజేష్

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు 7
బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

వసతి గృహాలపై నిఘా..



సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

- విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం
- మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 35 బీసీ, 56 ఎస్సీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 8 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వారందరి రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోంది.

ఏలూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు భద్రత పెంచేందుకు అనుగుణంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వసతి గృహాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీసీ కెమెరాల ఏర్పాటు గాలికి వదిలేసింది. హాస్టళ్లలోకి ఎవరు వస్తున్నారో.. వెళుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీటిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భద్రతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. దీని వల్ల వసతి గృహాలపై నిఘా పెట్టేందుకు వీలుంటుంది. విద్యార్థుల భద్రత మరింత సులభతరం అవుతుంది. జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో సీసీ కెమెరాలను అమర్చాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

మౌలిక సదుపాయాలపై దృష్టి

మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం అధికారులలను ఆదేశించింది. ఇప్పటికే సెక్యూరిటీ గార్డులను నియమించింది. ఉపాధి హామీ పథకం కింద ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే చాలాచోట్ల రక్షణ గోడల నిర్మాణం పూర్తయింది. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వసతి గృహాల్లో విద్యార్థులను మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కాస్మెటిక్స్‌ను జీసీసీ ద్వారా అదనంగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంది. మెనూ చార్జీలు పెంచింది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.1400 ఆపై తరగతుల చదువుతున్న వారికి రూ.1,600 చొప్పున మెనూ చార్జీలను ప్రభుత్వం చెల్లించనుంది. విద్యార్థులకు ప్రతీనెలా క్షవరం చార్జీల కింద రూ.50 చెల్లించనుంది. ప్రస్తుతం జిల్లాలోని 56 ఎస్సీ హాస్టళ్లలో ఒక్కొక్క హాస్టల్‌లో ఎనిమిది చొప్పున సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. బీసీ వసతి గృహాల్లో సంబంధించి సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఖర్చు వివరాలు అందజేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

మహిళలకు వన్ స్టాప్ చేయూత

బాధితులకు అందుబాటులో టోల్ ఫ్రీ నెంబర్ 112, 9550351100, 9491195221

కలెక్టర్ వెట్టి సెల్వి



ఏలూరు క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బాధిత మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మెరుగైన సహాయం అందించాలని కలెక్టర్ వెట్రి సెల్వి సూచించారు. బాల్య వివాహాలు నివారించాలి, 9వ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థిని 10వ తరగతిలో చేరాలన్నారు. బాధిత మహిళలకు టోల్ ఫ్రీ 112నెంబర్‌కిగాని, 9550351100, 9491195221 నెంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలు, బాలలకు అందుతున్న సహాయ కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, తదితర బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించాలన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు వారి సమస్యలను గుర్తించి, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, అవసరమైతే ఎఫ్ఐఆర్, నమోదు చేసి వారి సత్వర న్యాయం అందించే దిశగా వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఐసీడీఎస్ పీడీ శారద, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సీహెచ్ నిర్మల పాల్గొన్నారు.

ఏఎన్ఎంల బదిలీలు పారదర్శకమేనా?
నేడు ఉమ్మడి జిల్లా రెగ్యులర్ ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ 6

యోగా చేద్దాం

'అందరూ యోగా చేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం' అంటూ కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాసనాలు వేసి ప్రోత్సహించారు. సీఆర్ రెడ్డి కళాశాల ఆవరణలో విద్యార్థుల థీమ్ యోగాలో వారు పాల్గొన్నారు. యోగాసనాలు జీవితంలో భాగం కావాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

నేడు మాక్ డెమో

యోగా ప్రాధాన్యం తెలియజెప్పేందుకు జిల్లావ్యాప్తంగా శనివారం యోగాంధ్ర మాక్ డెమో నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం తెలిపారు. వట్లూరు టీటీడీసీలో ఉదయం 7 గంటలకు మాక్ డెమో జరుగుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 6,197 వేదికల్లో నిర్వహించే కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు యోగాంధ్రలో పాల్గొనేందుకు 8,46,428 మంది పేర్లను నమోదు చేసుకున్నారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

- పెదపాడు, ఆంధ్రజ్యోతి



సీఆర్ రెడ్డి కళాశాల ఆవరణలో విద్యార్థుల యోగా థీమ్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి, ఎమ్మెల్యే బడేటి చంటి తదితరులు



కొత్తగా వచ్చిన బుక్స్‌తో విద్యార్థినులు

విద్యా కిట్ భేష్

చిన్నారులకు తగ్గిన పుస్తకాల బరువు

బ్యాగ్‌లు, నోట్ పుస్తకాల్లో నాణ్యత

పాఠశాలలకు చేరిన విద్యా కిట్లు



భీమవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన రూపు మార్చిన ప్రభుత్వం ఉచితంగా అందించే విద్యాకిట్‌లలో మార్పులు తెచ్చింది. కిట్‌లు భేష్‌గా కనిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 1,392 ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపు లక్ష మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పాఠశాలలకు చేర్చారు. ఏలూరు జిల్లాలో మొత్తం 2,259 పాఠశాలలకు సంబంధించి కిట్లను అందించనున్నారు. గత ప్రభుత్వ కిట్‌లకు ఇప్పటి కిట్‌ల నాణ్యతలో ఎంతో మార్పు కనిపిస్తున్నది. ప్రైమరీ విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించారు. ఒకే పాఠ్యపుస్తకంలో రెండు మూడు సబ్జెక్టులు పొందుపరచడంపై ఉపాధ్యాయుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. 1, 2 తరగతులకు ఒకే పాఠ్యపుస్తకంలో తెలుగు, ఇంగ్లిష్, లెక్కలు సబ్జెక్టులు ఉండేలా రూపొందించారు. ఒకే వర్క్ బుక్‌ను మూడు సబ్జెక్టులకు ఇచ్చారు. దీంతో రెండు పుస్తకాలతో చిన్నారులు పాఠశాలకు వెళ్తే సరిపోతుంది. 3 నుంచి 5 తరగతి విద్యార్థులకు రెండు పాఠ్యపుస్తకాలు, రెండు వర్క్‌బుక్‌లలో చదువుకునేలా పొందుపరిచారు. దీంతో విద్యా బోధన సులువుగా ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఏడాదిపాటు ఉపయోగించినా బ్యాగ్ పొడవకుండా క్వాలిటీగా ఉన్న బ్యాగ్‌లు అందిస్తున్నారు. షూస్, బెల్ట్, నోట్ పుస్తకాలు నాణ్యతగా ఉన్నాయి. దీంతో ఇటు తల్లిదండ్రులు విద్యార్థులు విద్యా కిట్‌లు బావున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

విద్యాసామాగ్రి ఇలా..

పశ్చిమ గోదావరి జిల్లాలో 12 లక్షల 59 వేల 564 పాఠ్యపుస్తకాలు, 6 లక్షల 51 వేల 038 నోట్ పుస్తకాలు, 1 లక్షా 47 డిక్షనరీలు అందిస్తున్నారు. 93,458 బ్యాగ్‌లు, 93,453 యూనిఫామ్, 92,586 షూస్, 61 వేల 338 బెల్ట్‌లు అందించనున్నారు. ఏలూరు జిల్లాలో 6 లక్షల 98 వేల 68 మందికి పాఠ్యపుస్తకాలు, 7 లక్షల 62 వేల 28 మందికి నోట్ బుక్స్ 1,22,665 బ్యాగ్‌లు, 1,22,665 యూనిఫాం, 1,23,91 షూస్, 84, 154 బెల్ట్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

గతంలో అంతా డొల్ల

గత ప్రభుత్వం హయాంలో విద్యా కిట్లన్నీ డొల్లతనంగా ఉండేవి. స్కూల్ బ్యాగ్‌లపై బొమ్మలు వేసుకోవడానికి చూపించిన శ్రద్ధ నాణ్యతపై చూపించలేదు. దీంతో అవి మూడు నెలలకే పాడైపోయాయి. ఇతర సామగ్రి అంతే. పాఠ్యపుస్తకాలు ప్రైమరీలో ఇప్పటిలా రెండు సెమిస్టర్లు ఉండేవి కాదు.

విద్యార్థులకు ఎంతో మేలు



1, 2 తరగతుల విద్యార్థులలో బరువు లేకుండా పుస్తకాలు రూపుదిద్దారు. వారు సులువుగా చదువుకునేలా పాఠ్యాంశాలు పెట్టారు. రెండు సెమిస్టర్లు ఏర్పాటు చేయడం వల్ల చిన్నారులకు సబ్జెక్టులపై పట్టు వస్తుంది. ప్రభుత్వ ఆలోచన బాగుంది.

- బీడీకె మహనీయం, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు

బరువు తగ్గించారు



పాఠశాలకు దూరం నుంచి వస్తాను. రెండు సెమిస్టర్లు చేసి పుస్తకాల బరువు తగ్గించారు. బ్యాగ్, నోట్ పుస్తకాలు చాలా బాగున్నాయి.

- జోస్యు మహాలక్ష్మి, విద్యార్థిని

అప్పుడలా..ఇప్పుడిలా..



లింగపాలెం : గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అందించిన పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులపై అప్పటి ముఖ్యమంత్రి తన పేరుతో జగనన్న విద్యాకానుక అని పేరు ముద్రించి ఇచ్చారు. కూటమి ప్రభుత్వం బ్యాగులపై సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర అని ముద్రించి ఆదర్శవంతంగా నిలిచింది.

ఎడాపెడా మట్టి తోలకాలు

పాడైపోతున్న రహదారులు

వేసవి కాలం వచ్చిందంటే మట్టి వ్యాపారస్థులకు పండగే.. వేసవి కాలం అంతా రోడ్ల పక్కన రోడ్లుపక్కన లే అవుట్‌లు పూడ్చడం, చెరువులు పూడ్చటం వంటివి చేపడతారు. రైతులకు సంబంధించి తమ భూములో మట్టిని తవ్వేందుకు సంబంధిత అధికారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. మట్టి అక్రమార్కులు మాత్రం రైతుకు ఇటువంటి నిబంధనలు చెప్పకుండా వారే ట్రాక్టర్‌ల సహాయంతో రైతులు భూముల్లోకి మట్టిని రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తోలేస్తున్నారు. మట్టి ట్రాక్టర్ల వల్ల ఇటీవల వేసిన రహదారులు పాడైపోతున్నాయి. మట్టి బెరడులు పడి రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. వాహనదారులు బైక్‌లపై నుంచి జారి పడిపోతున్నారు..అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- పెనుగొండ,(ఆంధ్రజ్యోతి)


వడలిలో ట్రాక్టర్‌పై మట్టి తరలింపు


రహదారిపై పడిన మట్టి

తెల్లవారితే మైక్‌ల హోరు !

వ్యాపారుల ప్రచారంతో ఇబ్బందులకు గురవుతున్న వృద్ధులు, రోగులు

ఒకవైపు అటవీ ప్రాంతం, మరో వైపు మెట్ట ప్రాంతం.. గోదావరి పరివాహక ప్రాంతాలతో చక్కని ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పల్లెల కనిపిస్తాయి. పట్టణాల్లో ఉద్యోగాలు చేసేవారైనా ప్రశాంతత కోసం గ్రామాల్లోనే ఉంటారు. రణగొణ ధ్వనులు లేకుండా హాయిగా నిద్రపోవచ్చని అనుకుంటారు. తెల్లవారుజామున కాస్త అలసట తీర్చుకుంటున్న సమయంలో చికాకు పుట్టించే శబ్దాలతో బండ్లపై విక్రయించే చిరు వ్యాపారులు ఒకరు వెనకాల ఒకరు వస్తుండడంతో ఇబ్బందులకు గురవు తున్నారు. పల్లె నుంచి పట్టణం వరకూ ఈ మైక్‌ల హోరుతో చికాకు పుట్టిస్తున్నారు. ఉదయాన్నే మైక్ పెట్టి వంద రూపాయలకు ఏడు కేజీల ఉల్లిపాయలు అంటూ ఒక మైక్ వెళ్ళగా... కొత్తిమీర, పుదీనా అంటూ మరో మైక్ వస్తుంది... పాతసామాన్లు కొంటాం, ప్లాస్టిక్ సామాన్లు,ఇనుప సామాన్లు, పాత ఏసీలు, పాత బ్యాటరీలు కొంటాం.. ఇనుప వస్తువులకు ఉల్లిపాయలు ఇస్తామంటూ ఇంకో మైక్. సీజనల్ ఫ్రూట్స్ వారు కూడా మైక్‌లను పెట్టుకుని హోరెత్తిస్తున్నారు.నిత్యం కూరగాయలు అమ్మే వ్యక్తి కూడా ఈ మైక్‌తోనే గోలపెట్టడంతో ఏ వీధి చూసినా, ఏ ప్రాంతం చూసినా భరించలేక ఎవరితో చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉంటున్నారు. ముఖ్యంగా ఉదయాన్నే పిల్లలు చదువుకోవడం, వృద్ధులు నిద్ర పోతున్న సమయంలో ఈ మైక్‌ల గోల పెరిగిపోవడంతో వినుగెత్తిపోతున్నారు. పగటి వేళ సాధారణంగా 50 డెసిబుల్స్, రాత్రి వేళ 40 డెసిబుల్స్ సౌండ్ దాటకూడదు. ప్రస్తుతం ప్రతి వ్యాపారి కూడా మైక్‌లు పెట్టి 80 డెసిబుల్స్ దాటి సౌండ్‌లతో మైక్‌లను వినియోగిస్తున్నారు. దీని వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వీటిని కట్టడి చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుకుంటున్నారు.

- ఏలూరు క్రైం (ఆంధ్రజ్యోతి)


బళ్లపై మైక్‌లు పెట్టుకుని అమ్మకాలు


ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన యోగాలో పాల్గొన్న వేలాది మంది

యోగాతో ఆరోగ్యం


ఏలూరుసిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల థీమ్ యోగాతో హేలాపురి నగరం పులకరించింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో ప్రదర్శించిన యోగా ముద్ర ఆకృతి అందరినీ ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు బడేటి చంటి,


ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

హేలాపురిలో యోగా సందడి

పాల్గొన్న వేలాది మంది

చింతమనేని ప్రభాకర్ , జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి , రెడ్డి అప్పలనాయుడు తదితరులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నిత్యజీవితంలో యోగా భాగం కావాలన్నారు. మనదేశ సంస్కృతిలో భాగమైన యోగా ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయన్నారు. ఈనెల 21 న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఏలూరు జిల్లాలో ఇప్పటిరవకు 8,43,302 మంది ఎంతో ఉత్సాహంగా యోగా కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు తమపేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈనెల 14 వతేదీన కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగాంధ్ర మాస్ డిమాన్‌స్ట్రేషన్ నిర్వహిస్తారన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ నెల రోజులుగా ప్రజలకు యోగాను పరిచయం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ యోగా పట్ల అందరూ అవగాహన పెంచుకుని ఆరోగ్యం మెరుగుపరచుకోవాలన్నారు. తనకు యోగాపై అవగాహన ఇప్పటివరకు లేదని యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుని తాను కూడా యోగాసనాలపై మక్కువ పెంచుకున్నానన్నారు. ఏలూరు, దెందులూరు ఏఎంసి చైర్మన్‌లు మామిళ్ళపల్లి పార్థసారధి, గారపాటి రామసీత , కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, డీఆర్‌వో విశ్వేశ్వరరావుతో పాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


ఆసనాలతో ఆకట్టుకున్న యోగా ట్రైనర్



యోగా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి



యోగాతో మనసు ఉత్తేజం..

క్షీరపురి యోగా సత్సంగం గురువు జువ్వాజీ కల్యాణ్

పాలకొల్లు, జూన్, 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజూ యోగా చేయడం వల్ల మనసు ఉత్తేజభరితం అవుతుందని, మంచి శక్తిని పొందడంతో పాటు శరీర సౌష్టవాన్ని పొందవచ్చునని పాలకొల్లు క్షీరపురి యోగ సత్సంగం నిర్వాహకుడు, యోగా గురువు జువ్వాజీ కల్యాణ్ తెలిపారు. 18 ఏళ్లుగా యోగా చేస్తున్నట్లు తెలిపారు. యోగాతో వత్తిడి తగ్గించుకోవడం, రక్త ప్రసరణ మెరుగు పరచుకోవచ్చునని తెలిపారు. ఇప్పటి వరకూ సుమారుగా 300 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. బ్రహ్మ ముహూర్తంలో యోగా చేయడం వల్ల చాలామందికి వారి వ్యాధి రుగ్మతల నుంచి ఉపశమనం లభించిందని, ముఖ్యంగా మహిళలకు యోగాలో శిక్షణ పొందడం మంచిదని తెలిపారు. ప్రతీ రోజూ 150 మందికి యోగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం, ఆసనాలు నేర్పిస్తానని తెలిపారు.

రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు

కొత్త కొత్త నిబంధనలతో అవస్థలు

ఇప్పటికే స్లాట్ బుక్కింగ్‌లో తరచూ ఇబ్బందులు

పాన్‌కార్డు తప్పనిసరి చేయడంపై కక్షిదారుల్లో అసహనం



ఆచంట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రతీ రోజూ రిజిస్ట్రేషన్ ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. అయితే రోజుకో కొత్త నిబంధనలు పెడుతుండటంతో రిజిస్ట్రేషన్‌లు సజావుగా సాగడం లేదు. అనేక ఆటంకాలు కలుగుతూనే ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం 2.0 విధానం తీసుకువచ్చింది. దాని తరువాత స్లాట్‌బుక్కింగ్ విధానాన్ని తీసుకువచ్చారు. ఈ విధానంతో మొదట్లో సర్వర్ సరిగ్గా పని చేయక రిజిస్ట్రేషన్‌కు తరచూ ఆటంకాలు ఏర్పడుటుతుండంతో కక్షిదారులు ఇబ్బందులు పడుతూనే ఉంటున్నారు. తరచూ సర్వర్ సమస్య నెట్‌సౌకర్యం సరిగ్గా పని చేయకపోవడంతో గంటలు కొద్దీ కక్షిదారులు కార్యాలయం వద్దే ఉండే పరిస్థితి తరచూ ఏర్పడుతూనే ఉంది. ఇదిలా ఉండగా మరలా ప్రస్తుతం ఇపుడు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కక్షిదారులు ఎంత మంది ఉన్నా వారికి తప్పనిసరిగా ఆధార్‌తో పాటు పాన్ కార్డులో డేటాఫ్ బర్త్ ఉంటేనే పబ్లిక్ డేటా అవుతుంది. పాన్‌కార్డు, డేట్ ఆఫ్‌బర్త్ విధానం శుక్రవారం నుంచి అమలులోకి రావడంతో అనేక మంది కక్షిదారులకు పాన్‌కార్డు లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌లకు అనేక చోట్ల ఆటంకాలు కలిగాయి. దీంతో ఏ దస్తావేజుకైనా తప్పనిసరిగా కక్షిదారులు అందరికి కూడా పాన్ కార్డులు ఉంటేనే రిజిస్ట్రేషన్లు జరగడానికి అవకాశం ఉంది. ప్రభుత్వానికి ప్రతీ రోజూ కోట్ల రూపాయలు ఆదాయం వచ్చే శాఖపైనే సంబంధిత శాఖల అధికారులు ఆంక్షలు ఎక్కుపెడతారని కొంత మంది కక్షిదారులు అంటున్నారు. పాన్‌కార్డు తప్పనిసరి కావడం వల్ల అమ్మకం, కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పవు.

ఏఎన్‌ఎంల బదిలీలు పారదర్శకమేనా?

నేడు ఉమ్మడి జిల్లా రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు జూమ్ పద్ధతిన కౌన్సెలింగ్

రేపు గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పదోన్నతులు

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఏఎన్ఎంలకు సాధారణ బదిలీ కౌన్సెలింగ్‌ను శనివారం జూమ్ విధానంలో నిర్వహించనున్నారు. నిబంధనల ప్రకారం ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఏఎన్ఎంలందరినీ తప్పనిసరి బదిలీ కింద అందుబాటులో వున్న వేకెన్సీలకు ఐచ్ఛికాలను తీసుకుని నూతన స్థానాలను కేటాయిస్తారు. ఆ మేరకు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న 190 మంది సీనియర్ ఏఎన్ఎంలను గుర్తించగా, వీరిలో రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్నవారిని, ఉద్యోగ సంఘాల నాయకులను మినహాయించి మిగతావారికి స్థానచలనం కలిగించనున్నారు. ఆ ప్రకారం కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ కింద గుర్తించిన 190 మంది రెగ్యులర్ ఏఎన్ఎంల వేకెన్సీలను జాబితాలో ప్రదర్శించాల్సి ఉండగా, వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన జాబితాలో 186 క్లియర్ వేకెన్సీలనే చూపడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తప్పనిసరి బదిలీ కింద కదలాల్సిన ఏఎన్ఎంలలో పలువురు తమలో తామే ఆయా పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు ఐచ్ఛికాలను ముందుగానే ఎంచుకుని పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో నూతనస్థానాలను ఖాయం చేసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాగ్ధాటి వున్నవారికి మంచిస్థానాలు, నోరు మెదపలేని వారికి సుదూర ప్రాంతాలే తప్పనిసరి అవుతాయని ప్రచారం జరుగుతోంది.

నిబంధనల మేరకే బదిలీ స్థానాల కేటాయింపు : డాక్టర్ గంగాభవాని, డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనాధికారి

బదిలీల్లో ఉద్యోగి ప్రస్తుతం పనిచేస్తున్న మండలం లేదా డీడీవో మారాలన్న నిబంధనేదీ లేదు. శనివారం ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారుల సమక్షంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు బదిలీల నిమిత్తం ఏఎన్ఎంలు హాజరుకావాలి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న ఏఎన్ఎంల ధ్రువపత్రాలన్నింటినీ పరిశీలించాం. రీ-డిప్లాయిమెంట్ (వర్క్ అడ్జస్ట్‌మెంట్) కింద వేర్వేరు చోట్ల పనిచేస్తున్న కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ ఉద్యోగులు బదిలీవద్దంటే వారిని మినహాయించేందుకు నడలింపునిస్తాం. ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న 256 మందికి ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పదోన్నతుల కౌన్సెలింగ్‌ను ఆదివారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహిస్తాం.

ఎదురుచూపులేనా ?

ఎర్రకాలువ రైతుల ఆవేదన

గతేడాది వరదలకు పంటనష్టం

ఇప్పటికీ పరిహారం అందకపోవడంపై అన్నదాతల్లో ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్, (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి పగపట్టింది..కనీసం ప్రభుత్వమైనా కనికరిస్తుందనే రైతుల ఎదురుచూపులు నేటికీ ఫలించలేదు. గత సంవత్సరం జూలై నెలలో వచ్చిన ఎర్రకాలువ వరదలకు పంట నష్టపోయిన ప్రాంత రైతులకు ప్రభుత్వ పంట నష్టం అదించాల్సి ఉంది. కానీ ఆ తరువాత ఆగస్టులో వచ్చిన వర్షాలకు నష్టపోయిన పంటకు పరిహారం ప్రకటించారు. కానీ అంతకు ముందు నష్టపోయిన పంటకు పరిహారం ప్రకటించడంలో ప్రభుత్వ మీనమేషాలు లెక్కిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ నెలలో జిల్లాలో పంట నష్టం అంచనాలను అధికారులు లెక్కించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దానికి సంబంధించి సుమారు రూ.9 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై ఇటీవల ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, అరిమిల్లి రాధాకృష్ణలు అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అయితే నేటికి రైతులకు ఆ పరిహారం అందకపోవడంతో ఇటీవల జరిగిన అసంబ్లీ సమావేశాల్లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిహారం అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ దఫా వచ్చే పరిహారంలో ప్రభుత్వం తమకు పంటనష్టం అందిస్తుందని రైతులు ఆశ పడ్డారు.

అగ్రభాగం తాడేపల్లిగూడేనికే

ఎర్రకాలువ వరదల కారణంగా గతేడాది జూలైలో ప్రకృతి వైపరీత్యానికి జిల్లాలో 9 కోట్ల రూపాయల పరిహారం అందించాల్సి ఉండగా వాటిలో తాడేపల్లిగూడెం మండలంలోని ఎర్రకాలువ పరివాహక ప్రాంత రైతులకే రూ.6 కోట్లు చెల్లించాల్సి ఉంది. మొత్తం జిల్లాలో సుమారు 2,200 మంది రైతులకు పరిహారం అందాల్సి ఉండగా తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, అప్పారావుపేట, నందమూరు తదితర గ్రామాల రైతులకు ఈ పరిహారం అందించాల్సి ఉంది.

తీవ్రంగా నష్టపోయాం..



ఎర్రకాలువ వరదలకు మా ప్రాంతం అంతా పంట తీవ్రంగా నష్టపోయాం. మాకు ప్రత్యే కంగా ఎనిమిదిన్నర ఎకరాలకు పరిహారం అందాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు పరిహారం అందించాలని కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్లాం.

- ముళ్లపూడి రామకృష్ణ, జగన్నాధపురం రైతు

ఏడాదిగా ఎదురుచూస్తున్నాం



మా ప్రాంతంలో పంట నష్టం జూలైలో సంభవించింది. ఆగస్టులో పంటనష్టపోయిన వారికి పరిహారం అందించారు. పరిహారం అందుతుందని రైతులంతా ఏడాదిగా ఎదురు చూస్తున్నాం. మా ప్రాంత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసంబ్లీలో పరిహారం కోసం వివరించారు. నేటికీ ఆ పరిహారం అందలేదు..

-పరిమి వీరభద్రరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నవాబుపాలెం


ఎర్రకాలువ వరద పోటుతో గట్లు తెంచుకుంటూ చేలల్లోకి వరదనీరు (ఫైల్)

నిస్వార్థంగా పనిచేస్తున్నా.. అడ్డొస్తే ఊరుకోను

డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు


మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు

కాళ్ళ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేస్తున్నానని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పెద అమిరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలుత విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం చేసిన మరుసటిరోజే సాగునీరు, డ్రెయిన్ల వ్యవస్థ మెరుగుపరుస్తానని అప్పటి కలెక్టర్‌తో భేటీ అయిన సందర్భంలో చెప్పగా ఖజానా ఖాళీగా ఉందని, నిధులు భారీగా ఇవ్వలేమనటంతో తాను, తన స్నేహితులు, ప్రజల సహకారంతో 'ఉండి డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్' పేరిట నిధిని ఏర్పాటు చేసి పనులు ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో ప్రధాన మంచినీటి సమస్యను అధిగమించడానికి గ్రామాల్లో మైక్రోఫిల్టర్లను ప్రభుత్వం, దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పంట కాలువలను కలుషితం చేస్తున్న ఆక్వా రైతులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొంత మంది ఆక్వా రైతులు కాలువ గట్లను ఆక్రమించుకుని వాడుకుంటున్నారని, దీనివల్ల కాలువల ఆధునీకరణ జరగడం ఇబ్బందిగా మారిన తరుణంలో కులమతాలకతీతంగా ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ఇళ్లు తొలగించినవారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తాను నిస్వార్థంగా పనిచేస్తున్నానని, తన విధులకు ఏ స్థాయి వారు అడ్డు వచ్చినా సహించనన్నారు. ప్రతిచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల అన్ని నేరాలు బయటపడే అవకాశం ఉందన్నారు. అదే విధంగా లే అవుట్లు వేసేవారు అప్రూవ్డ్ లే అవుట్‌లు వేసి మాత్రమే అమ్మాలన్నారు. తన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంటుందో తన నియోజకవర్గమంతా అలాగే ఉండాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. రాబోయే ఆరు నెలల్లో ప్రారంభించిన పనులన్నీ పూర్తి చేస్తానని తెలిపారు.

జడ్పీ సీఈవోగా శ్రీహరి బాధ్యతల స్వీకారం


నూతన సీఈవోను అభినందిస్తున్న ఉద్యోగులు

ఏలూరు సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సీఈఓగా ఎం. శ్రీహరి శుక్రవారం ఏలూరు జడ్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జడ్పీ సీఈఓగా అదనపు బాధ్యతలతో పనిచేస్తున్న కె. భీమేశ్వర్ డిప్యూటీ సీఈఓగా కొనసాగుతారు. శ్రీహరి నెల్లూరు జిల్లాలో ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ సీఈఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ నేతృత్వంలో జిల్లా అధికారులు, ఎంపీడీవోల సహకారంతో జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకువెళతానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన శ్రీహరిని జడ్పీ ఏఓలు ప్రకాష్, జాన్సన్, రాములు, కనకరాజు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రాజు, కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

పునరావాస కాలనీకి తరలండి : ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో ఎంవీ రమణ

కుక్కునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు వచ్చే సమయం ఆసన్నమైనందున ముందే పునరావాస కాలనీకి తరలి రావాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ నిర్వాసితులను ఆదేశించారు. శుక్రవారం దాచారం పునరావాస కాలనీలో గొమ్ముగూడెం, లచ్చిగూడెం నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఇప్పటికే గొమ్ముగూడెం గ్రామస్థుల భూములకు వ్యక్తిగత పరిహారం చెల్లించిన క్రమంలో జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం తరలి వెళ్లాల్సి ఉంది. అయితే అక్కడ నిర్మాణాలు ఇంకా పూర్తికాక దాచారం పునరావాస కాలనీకి తరలిరావాలని ఆర్డీవో సూచించగా నిర్వాసితులు దాచారం పునరావాస కాలనీలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేవని నిర్వాసితులు తెలపగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, ముందుగానే తరలిరావడానికి సిద్ధంగా ఉండాలని ఆర్డీవో కోరారు. అంతకు ముందు కుక్కునూరు జడ్పీ హైస్కూలులో సన్న బియ్యం, మెనూ పరిశీలించి మెనూ పాటించాలని సూచించారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అభయారణ్యంలో అక్రమ పూడ్చివేతల పరిశీలన


ఫారెస్టు అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఆకివీడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలకు పాల్పడి పూడ్చివేత పనులు చేపట్టిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి రామలింగాచార్యులు హెచ్చరించారు. స్థానిక సమతానగర్ శివారులో అభయారణ్య పరిధిలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి కాలువ వెంబడి అడ్డగోలుగా మట్టితో పూడ్చేస్తున్నారని రైతులు, నాయకుల ఫిర్యాదు మేర శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో కొలతలు చేపట్టామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో జరిమానా విధిస్తామని తహసీల్దార్ తెలపగా, ఎఫ్ఆర్వో కేసు నమోదు చేస్తామన్నారు. అంతేకాక ఆ ప్రాంతంలో బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా రాజేష్


నియామకపత్రం అందుకుంటున్న రాజేష్

నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం నూజివీడు క్యాంపస్‌లో డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా రాజేష్ నియమితులయ్యారు. ఆంగ్ల శాఖలో ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్. రాజేష్‌ను డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాయ్స్)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ బాధ్యతలో రాజేష్ ఒక ఏడాది పాటు కొనసాగుతారు. బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌ను సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, నూజివీడు క్యాంపస్ పరిపాలనాధికారి బి. లక్ష్మణరావు, డీన్ ఎస్. చిరంజీవి, చీఫ్ వార్డెన్ బి. సురేష్‌బాబు, పూర్వ డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ జాడ సీతాపతిరావు తదితరులు అభినందించారు.

రెండేళ్ల క్రితం నరసాపురం పట్టణ ప్రాంతంలో ఒక వ్యక్తి బ్యాంకు ఏటీఎంకు వెళ్లి అందులో దొంగనోట్లను జమ చేశాడు. ఆ మిషన్ ఒరిజినల్ నోట్లను మాత్రమే తీసుకుని దొంగనోట్లను పక్కకు గెంటివేసింది. తర్వాత బ్యాంకు అధికారులు వచ్చి మిషన్ ఓపెన్ చేయగానే దొంగ నోట్లు కనిపించాయి. సీసీ కెమెరా పుటేజీ ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై ఐదుగురిపై కేసు నమోదైనప్పటికీ ఇప్పటి వరకు ఆ కేసు పురోగతి సాధించలేదని సమాచారం.

భీమవరం పట్టణానికి చెందిన ఒక వ్యక్తి దళారుల మాటలు నమ్మి లక్షకు రూ. 5 లక్షలు ఇస్తామంటే తీసుకున్నాడు. ఆ దొంగనోట్లను ఎలా చెలామణీ చేయాలో తెలియక స్నేహితుడు రిజిస్ట్రేషన్ కోసం ఆ సొమ్మును అప్పుగా ఇచ్చాడు. అక్కడ అవతలి వారు నగదు తీసుకుని రెండోరోజు మిషన్‌లో పెట్టగా దొంగనోట్లుగా తేలింది. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట పడడంతో అసలైన నిందితుడిని అరెస్ట్ చేశారు.

పది రోజుల క్రితం తణుకు పట్టణంలో ఒక వ్యక్తి దొంగనోట్లను మార్చేందుకు ఏటీఎంలో నగదు జమ చేశాడు. ఆ నగదు అతడి అకౌంట్‌కు జమ కాకపోవడంతో బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారులు దర్యాప్తు చేసి దొంగనోట్లను ఆ వ్యక్తే తీసుకువచ్చినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ కుంభకోణంలో ఏడుగురు వ్యక్తులు ఉన్నట్టుగా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతానికి ఐదుగురిని అరెస్ట్ చేశారని, ఇంకా ఇద్దరు పరీరాలో ఉన్నట్టు తెలిసింది.

దొంగ నోట్ల దందా


తణుకులో ఫేక్ కరెన్సీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్ (ఫైల్)

ఉమ్మడి పశ్చిమలో రెచ్చిపోతున్న దొంగనోట్ల ముఠాలు

- మూడు ముఠాలే కీలకం
- నిఘా పెట్టి పట్టుకుంటున్న పోలీసులు

ఎదుటివారి అత్యాశే.. మోసగాళ్లకు ఒక వరం. ఇది సమాజంలో నిత్యం కనిపిస్తున్న పరిస్థితులు. త్వరితగతిన ఏదో మార్గంలో ఎదిగిపోవాలనే అత్యాశతో కొంతమంది అడుగులు వేస్తూ ఉంటారు. చివరకు తమకు ఉన్న సంపాదనను కూడా తమ అత్యాశ వల్ల పోగొట్టుకునే పరిస్థితులు వస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇటీవల కాలంలో నాలుగైదు దొంగనోట్ల చలామణి ఘటనలు జరిగాయి. కొంతమంది అత్యాశ గల వారిని ఎంపిక చేసుకుని రూ.లక్షకు రూ. నాలుగు లక్షలు దొంగనోట్లు ఇస్తామంటూ వారికి ప్రలోభపెట్టి లొంగదీసుకుంటున్నారు. ఆ తరువాత మోసపోయిన వారు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో దొంగనోట్ల మూడు ముఠాలు ఆరితేరి అత్యాశ ఉన్న వారిని ఎంపిక చేసుకుంటూ ఇట్టే బుట్టలో పడేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు అరెస్టు చేసి ఈ ముఠాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నా.. ఏదో ఒక రోజు ఒకేసారి ధనవంతులం కాకపోతామా అంటూ ఇలాంటి మోసగాళ్ల మాటలు నమ్ముతూ సొమ్ములను పోగొట్టుకుంటూ మోసపోయిన ఘటనలు ఉన్నాయి.

అత్యంత త్వరగా ఆకర్షణకు గురయ్యే నకిలీ నోట్లు, నకిలీ బంగారం. జిల్లాలో మట్టి పనులు చేస్తున్నామని, మట్టి తవ్వినప్పుడు ఈ బంగారపు ముక్కలు దొరికాయంటూ నమ్మించి ఆ బంగారపు ముక్కను షాపునకు తీసుకువెళ్లి నాణ్యతను పరీక్షించుకోవచ్చునంటూ ఆ ముక్కలోని చిన్న ముక్కను కట్ చేసి ఇస్తారు. ఈ ముక్క పరీక్షిస్తే నిజమైనదే అవుతుంది. కానీ మిగిలిన ముక్క అంతా ఇత్తడే. పాపం తక్కువ ధరకు ఎక్కువ బంగారం వస్తుందని మోసపోయిన వారు ఎందరో ఉన్నారు.

- ఇటీవల ద్వారకాతిరుమల మండలం టి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోడూరు రవితేజ కొంతకాలం నుంచి జంగారెడ్డిగూడెంలో ఉంటూ పట్టణంలోని పద్మా థియేటర్ ప్రాంతానికి షేక్‌నాగూర్ మీరావలి, మసీదు సెంటర్‌కు చెందిన వీరంకి రాజేష్‌లతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు తరచుగా ద్వారకా తిరుమల వెళుతూ అక్కడ హోటల్ నడుపుకుంటున్న కొల్లి వెంకట సుబ్రహ్మణ్యం అలియాస్ సుభాశ్‌తో మాటలు కలుపుతూ ఇక్కడ టూరిస్టులు ఎక్కువగా వస్తున్నారని ఈ నేపథ్యంలో నకిలీ నోట్లు సులువుగా చలామణీ అవుతాయని తమ వద్ద రూ.15 లక్షల నకిలీ నోట్లు ఉన్నాయని రెండున్నర లక్షల రూపాయలు అసలు నోట్లు ఇవ్వాలని రవితేజ ముఠా సుభాష్‌కు చెప్పడంతో అత్యాశతో అంగీకరించాడు. మొత్తం మీద ఆ సొమ్ములను మార్చుకునే సమ యంలో ద్వారకాతిరుమల పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.
- మరో ముఠా చింతలపూడి పరిసర ప్రాంతాల్లో ఉంటూ నకిలీ కరెన్సీ తీసుకువచ్చి జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో మోసాలకు పాల్పడడంతో అరెస్టు చేశారు.

దొంగనోట్లు చలామణి ఇలా..

ఇతర రాష్ట్రాల నుంచి అధునాతన పరికరాలను కొనుగోలు చేసుకువచ్చిన దుండగులు వాటిని నిర్మానుష్య ప్రాంతాల్లోని ఇళ్లను అద్దెకు తీసుకుంటారు. వాటిని అందులో ఉంచి కావలసిన పేపర్లు, ఇంకులు వంటివి సేకరించి, రాత్రి సమయాల్లో ప్రింట్ చేస్తూ ఉంటారు. అనంతరం వాటిని ఆరబెట్టి కట్టలుగా బయటకు తీసుకువెళతారు. ఇక అక్కడ నుంచి అమాయకులు ఎవరు దొరుకుతారా అని వల వేస్తారు.

అత్యాశకు పోకూడదు



కష్టపడకుండా అక్రమ మార్గంలో సొమ్ములను పొందాలంటే ఇబ్బందులకు గురై నష్టపోక తప్పదు. నకిలీ నోట్ల ముఠాలపై నిఘా ఉంచాం. వారి కదలికలను గుర్తించేందుకు ఫేస్‌రికగ్నైజింగ్ కెమెరాలతో ఎప్పటికప్పుడు గుర్తించి పరిశీలన జరుపుతున్నాం. ప్రజలు ఆశకు పోకూడదు. మోసగాళ్ల సమాచారాన్ని 112కు గాని, జిల్లా పోలీస్ కార్యాలయ వాటా ట్సప్ 95503 51100కు సమాచారమివ్వండి.

కేపీఎస్ కిశోర్, ఎస్పీ, ఏలూరు జిల్లా

దొంగనోట్లు చెలామణి చేస్తే చర్యలు



ఎవరైనా దొంగనోట్లు ఇస్తాం.. అసలైన నోట్లు ఇవ్వండి అంటూ ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి. కొందరు దళారులు అమాయకులను వలలో వేసుకుని ఒక్కసారిగా కోటీశ్వరులైపోదామన్న ఆలోచనలో నేరాలకు పాల్పడుతున్నారు. నేరాలకు పాల్పడ్డ వారిపై పోలీసు శాఖ ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేసింది. కఠిన శిక్షలు పడతాయి.

- ఆర్‌జీ. జయసూర్య, భీమవరం డీఎస్పీ

- ఇంకో ముఠా తణుకు ప్రాంతాల్లో ఉంటూ డబ్లింగ్ కరెన్సీ చలామణి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నోట్ల కట్టలో పైనకింద అసలు నోట్లను పెట్టి మధ్యలో నల్లరంగుతో ఉన్న నోట్లను ఉంచుతారు. ఆ నోట్లను తాము ఇచ్చిన రసాయనంలో తడిపి ఆరబెడితే అసలు నోట్లుగా మారుతుందని చెబుతూ మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఈ బృందాలపై నిఘా ఏర్పాటు చేసి అరెస్టులు చేస్తూనే ఉన్నారు. ఇంకోవైపు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో గుర్తించే విధానం ఉండగా మరోవైపు నేరస్తుల కదలికలపై నిఘా ఉంచుతున్నారు.

కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు కల్పించకపోవడంపై ఫిర్యాదు


డీఈవోకు ఫిర్యాదు అందజేస్తున్న జేఏసీ జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కుటుంబాల పేదవిద్యార్థులకు అన్ని కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లకు ఉచితంగా ప్రవేశాలు కల్పించాల్సి ఉండగా జిల్లాలోని సంబంధిత కార్పొరేట్ పాఠశాలలు నిరాకరిస్తుండటంపై శుక్రవారం డీఈవో వెంకట లక్ష్మమ్మకు ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏలూరు జడ్పీ మీటింగ్ హాలులో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ హాలులో డీఈవోను కలుసుకుని ఫిర్యాదు అందజేశారు. జిల్లాలో కార్పొరేట్ పాఠశాలలవారీగా కేటాయించిన సీట్ల వివరాలు, భర్తీచేసిన సీట్ల వివరాలు తెలియజేయాలని కోరారు. ఉచిత ప్రవేశాలకు నిరాకరించడానికిగల కారణాలపై అన్ని మండలాల ఎంఈవోలతో పర్యవేక్షణ చేయించాలని డిమాండ్ చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ సర్వేశ్వరరావు, సెక్రటరీ జనరల్ కృష్ణ, కోశాధికారి వెంకటేశ్వరరావు, కో-చైర్మన్లు సురేష్‌బాబు, హనుమ, స్టీవెన్, ప్రవీణ్, రమణ, తదితరులున్నారు.

మా పిల్లలకీ పథకాలివ్వండి: అంగన్వాడీలు

ముసునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు ప్రభుత్వం తక్షణమే సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ముసు నూరు తహసీల్దార్ కేవీ రమణకు శుక్రవారం అంగన్‌వాడీలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 12 వేలు లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే అంగన్‌వాడీ వర్కర్‌కు రూ. 11,500, హెల్పర్, మినీ వర్కర్‌కు రూ. 7 వేలు గౌరవ వేతనంగా ఇస్తున్నారని, అయితే అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదయ్యారని సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పి.రాజకుమారి, కె.విద్యావతి, సులోచన, రమాదేవి పాల్గొన్నారు.

పీ-4లో భాగంగా ఆర్థిక సాయం

నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పీ-4లో భాగంగా మండల వెంకటరామయ్య తుక్కులూరు గ్రామ పరిధిలోని పేద విద్యార్థులకు రూ. 40 వేలు, వృద్ధాశ్రమంలో వీల్ చైర్స్ కోసం రూ.30 వేలు అందించారు. ఈ సందర్భంగా పీ-4 కోఆర్డినేటర్ బి. సుబ్బారావు మాట్లాడుతూ స్వయంగా సీఎం చంద్రబాబు పేదల అభ్యున్నతికి పిలుపునివ్వడంతో మండవ ఫౌండేషన్ ద్వారా మండల వెంకటరామయ్య వారి తనయులు ప్రభాకర్ రావు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పేద కుటుంబాలలోని వారు చిరు వ్యాపారులు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ యువతి మృతి

భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి.. చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందినట్టు భీమవరం వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిత్రమానం గ్రామానికి చెందిన సంగాని రామలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో భీమవరం తన తమ్ముడి ఇంటికి వచ్చారు. గతనెల 28న మొబైల్ ఫోన్ విషయంలో వాగ్వాదం చేసుకోవడంతో పెద్ద కుమార్తె అయిన సంగాని చందనప్రియ(20)ఉ ఆమె తల్లి మందలించారు. మరుసటి రోజు 29న తెల్లవారుజామున రామలక్ష్మి తమ్ముడు ఇంటి బయట చూడగా ఆ యువతి షెడ్డులో ఇనుపరాడ్డుకు చీరతో ఉరివేసుకుని ఉండడం గమనించారు. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీ సాయంత్రం మృతి చెందింది. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మద్యం మత్తులో ఒకరి మృతి


లక్ష్మీకాంత్ మృతదేహం

కాళ్ళ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కాళ్ల మండలం పెద అమిరం గ్రామ పరిధిలో మద్యం మత్తులో ఒక వ్యక్తి మృతి చెందినట్టు కాళ్ల పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన ఎన్.లక్ష్మీకాంత్ (34) భీమవరం పట్టణంలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి వివాహమై ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసై మారకపోవడంతో సుమారు ఐదేళ్ల క్రితం భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన అతడు తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి సైకిల్‌పై వస్తూ పెద అమిరంలోని లిబర్టీ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు పక్కన రాయిపై పడిపోవడంతో కనుబొమ్మ వద్ద గాయమై చనిపోయాడు. శుక్రవారం ఉదయం స్థానికుల సమాచారంతో భీమవరం డీఎస్పీ జయసూర్య, ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, ఎస్‌ఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మదనాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.


కోమటిగుంటలో పంట కాలువలోకి వెళ్లిన స్కూల్ బస్సు

పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

కాళ్ళ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరిచిన రెండో రోజు శుక్రవారం స్కూల్ బస్సు ప్రమాదానికి గురవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులు చెందుతున్నారు. కాళ్ళ మండలం కోమటిగుంట గ్రామంలో భీమవరం పట్టణంలో ఉన్న ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన స్కూల్ బస్సు శుక్రవారం ఉదయం ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని విద్యార్థులను స్కూల్‌కి తీసుకువెళ్లడానికి వచ్చిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో అదుపు తప్పి సమీపంలోని పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అనుభవజ్ఞులైన డ్రైవర్‌లను పాఠశాల యాజమాన్యాలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు

- 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు అపహరణ


ఇంట్లో వెండి వస్తువులు, చిల్లర నగదును చెల్లాచెదురుగా వేసిన దొంగ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ

ఏలూరు క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనం కోసం కుటుంబంతో సహా ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటిని దోచేశారు. ఏలూరు దక్షిణపువీధికి చెందిన ఇన్నమూరి భాస్కరరావు భార్య, ఇద్దకు పిల్లలు, తల్లి కలిసి జీవిస్తున్నారు. ఆయన గడియారస్తంభం వద్ద ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్ షాపును నిర్వహిస్తున్నారు. ఈనెల 8న ఇంటికి తాళాలు వేసి కుటుంబం మొత్తం మొక్కుతీర్చుకోవడానికి తిరుపతి వెళ్లి దర్శనాలు పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపు గడియ తీసి ఉంది. బీరువాను పగులగొట్టి 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు దొంగలు అపహరించుకుపోయారు. వెండి వస్తువులు, చిల్లర నగదును ఇంట్లో మంచంపై చెల్లాచెదురుగా పడవేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ జి.సత్యనారాయణ, ఎస్‌ఐ మదీనాబాషా వారి సిబ్బంది, క్లూస్ టీమ్, పోలీసు జాగిలం బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అదేమార్గంలో వెళ్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దొంగతనం ఘటన తెలుసుకుని వారిని పరామర్శించి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని, దొంగలను అరెస్టు చేసి సొత్తు రికవరీ చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

- రూ.13 లక్షల విలువైన తొమ్మిది బైక్‌ల స్వాధీనం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు గేటు లోపల పార్క్ చేసిన మోటారుసైకిళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే దొంగను తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశామని సీఐ ఆదిప్రసాద్ తెలిపారు. గత కొంతకాలంగా తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు గురవుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్పీ పి.అద్నాన్ నయూం అస్మి, డీఎస్పీ విశ్వనాథ్‌ల ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు కొత్తపేట పంపుల చెరువు సెంటర్‌కు చెందిన పెరుమాళ్ల దానయ్య అనే పూతి ప్రసాద్‌ను పట్టుకుని విచారించారు. పూతి ప్రసాద్ గతంలో పలు చోరీలకు పాల్పడి జైలుశిక్ష అనుభవించిన రికార్డు ఉంది. ఈ క్రమంలో నిందితుడు తాడేపల్లిగూడెం, తణుకు, రావులపాలెం, గుడివాడ తదితర స్టేషన్‌ల పరిధిలో చోరీలకు పాల్పడినట్టు అంగీకరించాడు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి రూ.13లక్షలు విలువ చేసే తొమ్మిది మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ ఆది ప్రసాద్, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న కార్యదర్శి రత్నప్రసాద్

వృద్ధులను ఆదుకోవాలి

ఉమ్మడి పశ్చిమ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో 63 శాతం వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు జూన్ 15వ తేదీ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారని, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయిన తర్వాత పిల్లలకు తల్లిదండ్రులపై బాధ్యత లేకుండా పోయిందన్నారు. తల్లిదండ్రులు చిన్నానాటి నుంచే కుటుంబ విలువలు, సమాజం పట్ల అవగాహన కల్పించాలని పెద్దల జీవన అనుభవం కుటుంబ పాలనకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. నిరాదరణకు గురైన వృద్ధులు వారి పిల్లల నుంచి భరణం పొందే హక్కు ఉందని, గిఫ్టుగా ఇచ్చిన ఆస్తులను అవసరమైన పక్షంలో తిరిగి పొందవచ్చని సూచించారు.కార్యక్రమంలో న్యాయవాది రత్నరాజు, ఏలూరు వయోవృద్ధుల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్‌వీవీఎస్ ప్రసాదు, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశానికి తరలి రండి


విలేకరులతో మాట్లాడుతున్న తిరుపతిరావు, తదితరులు

తణుకు, జూన్13(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 15న తణుకులో నిర్వహించే అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశానికి పెద్దఎత్తున తరలి రావాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు కోరారు. శుక్రవారం సీపీఐ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసానికి గురై నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ సహకారంతో పదేళ్లుగా ఉద్య మిస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రభుత్వం అగ్రి ఆస్తులు స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీపీఐ నాయకులు బొద్దాని నాగరాజు, అసోసియేషన్ నాయకులు నాగలక్ష్మి, రామశ్రీను, కొండయ్య, శ్రీనివాసు, పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు నియంత్రించాలి'

జంగారెడ్డిగూడెం,జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పి.పవన్, బి.మనోజ్, జి.రమ్య, కె.అమూల్య, పి.సతీష్, పి.సుందర్ పాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

ఏలూరుటూటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ జీవో నంబరు 36 ప్రకారం జీతాలు పెంచాలన్నారు. సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.75వేలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు : చింతమనేని

పెదవేగి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల పార్టీ కార్యాలయంలో పలువురు ఎమ్మెల్యేని అభ్యర్థించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, ఎంతోమంది పథకాలకు దూరమయ్యారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీకి చర్యలు చేపట్టిందని భరోసా ఇచ్చారు. ఇళ్ల స్థలాలు లేని అర్హులకు ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి నిధులను కూడా మంజూరు చేస్తామన్నారు. తల్లికి వందనం సొమ్ము రాలేదని ఆందోళన చెందవద్దని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సొమ్ము కచ్చితంగా అందుతుందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు సన్మానం


ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

చింతలపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను కామవరపుకోటకు చెందిన బీజేపీ అధ్యక్షుడు ఎస్ఆర్ఆర్ ఎల్ఎస్ఎన్ రాజు అభినందనలు తెలుపుతూ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రధాని మోదీ సుపరిపాలనకు 11 ఏళ్ల పూర్తయ్యాయని శనివారం నుంచి నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యువ మోర్చా అధ్యక్షుడు ఘంటా సురేశ్, చింతలపూడి పట్టణ అధ్యక్షురాలు విజయకుమారి, సింగం ప్రసాద్ ఉన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి చర్యలు వేగంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రూ.ఐదు లక్షలతో ఆధునికీకరించిన మునిసిపల్ కమిషనర్ చాంబర్, కార్యాలయం ఎక్కేందుకు ఇనుప మెట్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత సుబ్బరాజు పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్‌లను అందించారు. కమిషనర్ రాంబాబు, కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, తాటి అప్పారావు, ధర్మరాజు, శేషగిరిరావు, ఎంఈవోలు కిరణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి'

భీమడోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీవో పద్మావతిదేవి నిర్వాహకులకు సూచించారు. భీమడోలు హైస్కూల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి, ఎంఈవో శ్రీనివాసరావుతో కలిసి భోజనాన్ని రుచి చూసి విద్యార్థులకు అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆహార పదార్థాలు బాగున్నాయని వారిని అభినందించారు. పాఠశాల హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు. భీమడోలు అరుంధతీ కాలనీలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎస్.పార్వతి, హెచ్ఎం జ్యోతిశర్మిల పుస్తకాలు అందజేశారు.

భవన కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం,జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ రమణ మాట్లాడుతూ 2018లో నిలిపివేసిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కె.స్లీవజోజీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు మంచిలి రాజు, కొల్లి రాంబాబు, యాదాల వెంకటేశ్వరరావు, వీర్రాజు, షేక్ బాజీ, భూషణం పాల్గొన్నారు.

మహిళలను గౌరవిస్తున్న ప్రభుత్వం

- జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ
- తల్లికి వందనం నగదు జమతో తల్లిదండ్రుల్లో ఆనందం



ఏలూరుసిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మహిళలను గౌరవిస్తూ ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్నా.. వారందరికీ తల్లికి వందనం ద్వారా చేయూత ఇవ్వడం కూటమి ప్రభుత్వ విజయమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ శుక్రవారం తెలిపారు. గత ప్రభుత్వం 42 లక్షల మంది పిల్లలకు ఈ సాయం అందిస్తే ఇప్పుడు తమ ప్రభుత్వం 67,27,164 మంది పిల్లలకు తల్లికి వందనం ద్వారా వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేశామని ఆమె తెలిపారు. నలుగురు పిల్లలు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులకు కూడా అందరికీ తల్లికి వందనం ద్వారా సహాయం అందుతోందన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలే మహారాణులని, ఇది మహిళల ప్రభుత్వమని రుజువయిందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతోందని, ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడం జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు.

టీడీపీ సంబరాలు

దెందులూరు/లింగపాలెం : టీడీపీ ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా తల్లికి వందనం పేరుతో ఒకే ఇంట్లో ఎంత మంది చదివితే అంతమందికి నగదును బ్యాంకుల్లో జమ కావడంతో దెందులూరు మండలం దోసపాడు, లింగపాలెం మండలంలో సంబరాలు నిర్వహించారు. దోసపాడు సర్పంచ్ గోరింక యేసుమణి, గోదావరి కాలువ డీసీ వైస్ చైర్మన్ అత్తులూరి చంద్రశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు గోరింక యేసోబు. నాయకులు మోడూరి వెంకటేశ్వర రావు, నెరుసు గంగరాజు, అత్తులూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. టాపాసులు కాల్చి సందడి చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులు సంబరాలలో పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



ఏలూరు రూరల్ : టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం తన ఇద్దరు బిడ్డలకు వర్తించింది. చాలా సంతోషంగా ఉంది. బ్యాంక్ ఖాతాల్లో పడ్డాయి. కుమార్తె షేక్ జహీరాబాద్ 9వ తరగతి చదువుతుండగా కుమారుడు షేక్ సాధిక్ రియాన్ శనివారపు పేట ఉర్దూ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. వీరిద్దరికి తల్లికి వందనం నగదు జమ కావడంతో కుటుంబం హర్షం వ్యక్తం చేస్తుందని, పిల్లలను పాఠశాలకు పంపించేలా ప్రోత్సహించేందుకు ఈ పథకం దోహదపడనుంది.

-షేక్ సబీరా, శనివారపుపేట.ఏలూరు


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

భీమవరం నుంచి భద్రాచలానికి నూతన బస్సు

ఏలూరు క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కొత్త బస్సులు, కొత్త రూట్లలో ప్రవేశపెడుతున్నామని ఆర్టీసీ విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. భీమవరం డిపోకి చెందిన కొత్త ఆర్టీసీ బస్సును ఏలూరు కొత్త బస్టాండ్‌లో శుక్రవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ బస్సు భీమవరం నుంచి భద్రాచలానికి కొత్త సర్వీసుగా నడపబడుతుందన్నారు. ఈ బస్సులు భీమవరంలో రాత్రి 8 గంటలకు బయలుదేరి ఏలూరు పది గంటలకు వస్తుందని, తెల్లవారు జామున 3 గంటలకు భద్రాచలం చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు బయలుదేరి ఏలూరు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటుందని భీమవరం సాయంత్రం మూడు గంటలకు చేరుకుంటుందని తెలిపారు. భీమవరం డిపో మేనేజర్ పీఎన్‌వీఎం సత్యనారాయణమూర్తి, ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఏఎంటి జి.మురళి, ఎంఎఫ్ఐ ప్రేమ్‌కుమార్, పీఆర్వో నరసింహం, కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు

కొయ్యలగూడెం, జూన్13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కిరణ్ హెచ్చరించారు. గురువారం ఈ మేరకు కార్యదర్శులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్నందున డ్రెయిన్ల పూడికతీత తీయించాలన్నారు. దోమలు, పందుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మేజర్ పంచాయతీలైన పరింపూడి, కన్నాపురం, రాజవరం, బయ్యన్నగూడెం పంచాయతీల్లో పారిశుధ్యంపై మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనేక గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కార్యద ర్శులు అప్రమత్తంగా ఉండాలని క్లోరినేషన్ చేయించాలని కోరారు.

బదిలీ అయిన డిప్యూటీ ఈవోకు సత్కారం

ద్వారకాతిరుమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయ డిప్యూటీ ఈవోగా పనిచేసి అన్నవరానికి బదిలీ అయిన పి.బాబూరావును ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి, ఇతర అధికారులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. తొలుత బాబూరావు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందారు. ఆయన స్థానంలో అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో డిప్యూటీ ఈవోగా పనిచేస్తున్న వై.భద్రాజీ చార్జ్ తీసుకున్నారు. ఈఈ భాస్కర్, డిప్యూటీ ఈవో భద్రాజీ, ఏఈవో మెట్టపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటం

ఏలూరుకార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పోరాటాలు చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏలూరు ఏరియా సమితి సమావేశాన్ని నిర్వహించగా బాలిన కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ 99 వార్షికోత్సవాలు పూర్తి చేసుకుని వందో వార్షికోత్సవంలో అడుగు పెడుతున్న సందర్భంగా మూడేళ్లకు ఒకసారి నిర్వహించే పార్టీ అంతర్గత మహాసభను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా రెండో మహాసభలు జూలై 5,6,7 తేదీల్లో చింతలపూడిలో జరుగుతాయన్నారు. సీపీఐ నాయకులు ఉప్పులూరి హేమశంకర్, కురెళ్ళ వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, మావూరి విజయ తదితరులు ఉన్నారు.

నేడు సీతారామచంద్రస్వామి కల్యాణం

కామవరపుకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం దత్తత ఆలయమైన తూర్పుయడవల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు, కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మూల విరాట్‌లకు అభిషేకం, అర్చనలు నిర్వహించి అనంతరం చతుష్టానార్చన జరిపారు. 14న ఎదుర్కోలు సన్నాహం, అనంతరం సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం జరుగుతుందని శేషాచార్యులు తెలిపారు. సోమవారంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.


అటవీశాఖ అధికారులను ప్రశ్నిస్తున్న చాటపర్రు సర్పంచ్ రఘు

ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వండి : ఎంపీపీ

ఏలూరు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు పలు అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. కొన్ని గ్రామాల సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్ళడానికి ఆసక్తి చూపకపోవడం విశేషం. తొలుత ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆయా శాఖలకు సబంధించి అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామాల్లో అక్రమ చెరవుల ధ్వంసంలో వివక్షత చూపిస్తున్నారని చాటపర్రు సర్పంచ్ రఘు అటవీశాఖ అధికారులను నిలదీశారు. ఇంకా ధ్వంసం చేయాల్సిన చెరువులు అనేకం ఉండగా ఎందుకు ధ్వంసం చేయలేదంటూ ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో కొంతమంది దొంగ మస్తర్లు వేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవోపీఆర్డీ బాషా, తహసీల్దార్ విజయ్‌కుమార్‌రాజు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'ఇంటర్ తొలి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించాలి'

కామవరపుకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ తొలి సంవత్సరానికి ప్రవేశ అర్హతలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కూటమి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కళాశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, కూటమి నాయకులు సంయుక్తంగా ధర్నా నిర్వహించి అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌కు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ మాట్లాడుతూ 1983లో ఈ కళాశాల ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో తొమ్మిది ఎకరాల స్థలంలో ప్రారంభమైందన్నారు. దేవస్థానం ట్రస్టుబోర్డు ఇంటర్ తొలి సంవత్సరానికి అడ్మిషన్లు తీసుకునేందుకు ప్రకటించకపోవడంతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవేశ అర్హతలు కల్పించడం లేదన్నారు. ఈ విషయాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వికు తెలిపామన్నారు. ఇప్పటికైనా ఇంటర్ తొలి సంవత్సరానికి ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు కిలారు సత్యనారాయణ, పసుమర్తి పార్థసారథి బాబు, గోరింక దాసు, గూడపాటి కేశవరావు, కంఠమనేని అంజిమూర్తి, కొండూరు జీవన్, రుద్రపాక వీరభద్రేశ్వరశర్మ, కాకి బుజ్జి, కొండూరు రామకృష్ణ, వందనపు మురళీకృష్ణ, జిజ్జూరి బాబ్జి, మురారి రాజకుమార్, డోలా విజయ్, బేతిన వెంకట్రావు పాల్గొన్నారు.

'ఆక్రమణల నుంచి పంచాయతీ ఆస్తులను కాపాడాలి'


ఆక్రమణకు గురైన పంచాయతీ స్థలం

టి.నరసాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆక్రమణల నుంచి పంచాయతీ ఆస్తులు కాపాడాలని బొర్రంపాలెంకు చెందిన సామాజిక కార్యకర్త గుండే పాండురంగ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో అసైన్డ్ ల్యాండ్ 50 సెంట్ల స్థలంలో ప్రభుత్వ భవనాలు సచివాలయం-1, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రేరి, బల్క్ మిల్క్ సెంటర్, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం పంచాయతీ వారు తీర్మానం చేసి ఆ ప్రాంతంలో పలు పనుల నిమిత్తం పునాదులు తీసి ఉంచారు. ఈ స్థలం ప్రభుత్వ భవనాలకు కేటాయించగా, మిగిలిని స్థలంలో అక్రమార్కులు అక్రమంగా నిర్మాణాలు చేస్తుంటే పంచాయతీ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కట్టడాలు తొలగించి పంచాయతీ స్థలాన్ని ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులను వివరణ కోరగా అక్రమంగా నిర్మిస్తున్నారని ఆరోపించిన ఆ నిర్మాణాన్ని పంచాయతీ కార్యదర్శి ద్వారా తాత్కాలికంగా నిలుపుదల చేశామని విచారణ అనంతరం ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

'పోడు భూములకు పట్టాలివ్వాలి'

వేలేరుపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : కొన్ని దశాబ్దాలుగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మున్నీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ, బ్యాంకురుణాలు అందకుండాపోతున్నాయని అందుకే ఆ భూములకు పట్టాలిచ్చి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. పోడుభూముల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని లేకుంటే గిరిజనుల నుంచి పోరాటాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా, మండల నాయకులు కారం దారయ్య, పిట్టా ప్రసాద్, బాడిస రాము, జాన్‌బాబు, చోడే ప్రసాద్, దుర్గారావు, చంద్రరావు, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పరిశుభ్రత పాటించాలి'

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత పాటించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలపై శుక్రవారం స్థానిక తంగెళ్లమూడి అర్బన్ పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ శిశువులకు వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతపై వివరించారు. వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

30వ రోజుకు ఆదివాసీల దీక్షలు

బుట్టాయగూడెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు రవ్వ బసవరాజు అన్నారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, ఏజన్సీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీలు, గిరిజన సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 30వ రోజుకు చేరాయి. దీక్షలో పొడియం కొవ్వాడయ్య, కణితి వెంకటస్వామి, సోడెం ముక్కయ్య, పూనం శ్రీను, కుంజా రమేష్, తెల్లం శ్రీను పాల్గొన్నారు.

చింతలపూడి ఎస్ఐగా సతీష్‌కుమార్ బాధ్యతలు

చింతలపూడి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎస్ఐగా కె.సతీష్‌కుమార్ శుక్రవారం కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో టి.నరసాపురం, తడికలపూడి, కొయ్యలగూడెం, ద్వారకాతిరుమలలో పనిచేశారు. ఇప్పుడు గోపాలపురం నుంచి బదిలీపై చింతలపూడి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కుటుంబరావు జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ అయ్యారు.

బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

జంగారెడ్డిగూడెం,జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 65వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో నందమూరి బాలకృష్ణ ఫేవరెట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆశ్రమంలో వృద్ధులకు అందజేశారు. సంఘ అధ్యక్షుడు మారిశెట్టి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు రాగాని శ్రీను, ప్రధాన కార్యదర్శి చిటికెన రాంబాబు, గౌరవ అధ్యక్షుడు తడికమళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐద్వా మండల నూతన కమిటీ ఎన్నిక

టి.నరసాపురం, జూన్13(ఆంధ్రజ్యోతి): ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శుల ఎంపిక ఏకగ్రీవమైంది. మండల కార్యదర్శిగా మడకం కుమారి, అధ్యక్షురాలిగా పంచకర్ల నాగలక్ష్మి ఎన్నికయ్యారు. శుక్రవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా మండల మహాసభ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఐద్వా సభ్యురాలు శిరీష అధ్యక్షతన జరిగింది. నూతన కమిటీ సభ్యులుగా మాంద్రు శిరీష, పి.మంగకుమారి, మరికొంతమంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మండల కార్యదర్శి మడకం కుమారి మాట్లాడుతూ మహిళలకు ఐద్వా అండగా ఉంటుందన్నారు.

'బీజేపీ పాలన అద్భుతం'

నిడమర్రు, జూన్ 13(ఆంధ్రజ్యోతి) బీజేపీ పదకొండేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి అగ్ర రాజ్యాలకు దీటుగా నిలబడిందని బీజేపీ ప్రధాన కార్యదర్శి బేతు గణేష్ అన్నారు. శుక్రవారం బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల విజయవంతమైన సుపరిపాలన పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమారి, పార్టీ జనరల్ సెక్రటరీ బేతు గణేష్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు ఇంటి ఉదయ్‌భాస్కర్, యువ మోర్చా మాజీ నాయకులు కమ్మెల గంగాధర్ రమేష్, మైనారిటీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్దుల్ వహాబ్, కిసాన్ మోర్చా నాయకుడు జెట్టిబోయిన లక్ష్మీనారాయణ, మహిళా మోర్చా నాయకు రాలు పుసుపులేటి కాశీ శివగంగ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి ఆనందం

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేకించి గతంతో పోల్చితే ఈసారి సొమ్ములు అందుకున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో అమ్మఒడి పథకంలో నాలుగేళ్ల పాటు 1,78,214 మంది విద్యార్థుల తల్లులకే సొమ్ములు జమ చేశారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒకే ఇంటిలో చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం వర్తింపు చేస్తామని ఎన్నికల హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడంతో ఆ మేరకు విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. సుమారు 2,15,082 మంది విద్యా ర్థులకు రూ.13 వేలు చొప్పున చేతికి అందినట్లయింది. గత ప్రభుత్వంలో సొమ్ములు అందుకున్న విద్యార్థుల సంఖ్యకు ఇప్పటికి దాదాపు అధికంగా ఉన్నట్లయింది. జిల్లాలో ఎక్కడ చూసినా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో సంతోషం వ్యక్తమైంది. కొందరు నేరుగా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరికొందరు తమ పిల్లలను అక్కున చేర్చుకుని సంతోషపడ్డారు.

తల్లుల ఖాతాల్లో అత్యధికులకు నగదు జమయ్యాయి. మరి మా సంగతి ఏమిటి, జిల్లా వ్యాప్తంగా ముగ్గురు లేదా ఇద్దరు ఉన్న కుటుంబాల్లో కొందరికి సొమ్ములు జమ కాలేదు. కొన్ని మండలాల్లో అందరికీ సొమ్ములు అందగా లింగంపాలెం, ఇతర మండలాల్లో మాత్రం శుక్రవారం పొద్దుపోయే వరకూ ఖాతాల్లో జమ కాకపోవడంతో తల్లుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ దీనికి సంబంధించి అధికారులు కూడా ఎటువంటి వివరణలతో ముందుకు రాకపోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదంతా సోమవారం నాటికి సర్దుబాటు అవుతుందని చెబుతున్నారు.


కూటమి ప్రభుత్వంలో ఆనందంగా ఉంది

కొయ్యలగూడెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చదువుకునే పిల్లలందరికి తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం డబ్బులు వేయడం ఆనందంగా ఉందని కన్నాపురం గ్రామానికి చెందిన తండ్రి సులకాని ప్రసాద్ అన్నారు. ప్రసాద్‌కు నలుగురు పిల్లలు కాగా ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు రూ.39వేలు పడ్డాయి. ముగ్గురు పిల్లలు ఆడపిల్లలు కావడం విశేషం. సాయిదుర్గ జడ్పీ పాఠశాలలో 7వ తరగతి, శ్రీరుతిక ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి, లక్ష్మీ 3వ తరగతి చదువుతున్నారు. ముగ్గురికి ఒకేరోజు డబ్బులు పడటంతో ఆ కుటుంబం ఎంతో ఆనందనం వ్యక్తం చేశారు.

ముగ్గురు పిల్లల తల్లుల ఖాతాలకు నగదు జమ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో ముగ్గురు పిల్లలున్న రెండు కుటుంబాలకు శుక్రవారం వారి తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నగదు జమ అయ్యాయి.

సంతోషంగా ఉంది



మాకు ఒక బాబు, ఇద్దరు కవల ఆడ పిల్లలు. శుక్రవారం తల్లికి వందనం నగదు రూ.39 వేలు నా ఖాతాలో జమ అయ్యాయి. చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో ఒకరికే అమ్మఒడి వేశారు. అదికూడా ఒక ఏడాది మాత్రమే వచ్చింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు.

- చిలుకూరి యామినీ ఉమాభారతి, జంగారెడ్డిగూడెం

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



మాకు ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం నగదు రూ.39 వేలు నా ఖాతాలో జమ కావడం సంతోషంగా ఉంది. కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు. పిల్లలకు పుస్తకాలు, ఫీజులు చెల్లిస్తాం. విద్యా సంవత్సరం ప్రారంభంలో నగదు జమ చేయడం ఉపయోగపడుతుంది.

- కామన శ్రీలక్ష్మి, జంగారెడ్డిగూడెం

16న అంగన్‌వాడీల ధర్నా విజయవంతం చేయాలి

బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పీవీ చలపతిరావుకు అందజేశారు. మండల అధ్యక్షురాలు పుష్ప మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయా లన్నారు. జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సీఐటీ యూ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు సీఐటీయూ నాయకురాలు కె.సుబ్బరావమ్మ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయ కురాలు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు రేషన్ కార్డులు అందించి, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయా లని కోరారు. దీనిలో భాగంగా ఈనెల 16న కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జి.బేబీరాణి, సూర్యారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

ముదినేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ శుక్రవారం ప్రారంభమైంది. మండలంలో 67 ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లకు సంబంధించి 3362 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. వడాలి జడ్పీ హైస్కూల్‌లో టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడుతూ ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

కలిదిండి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాబోయే మూడు రోజులు ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండే రైతులు, పశువుల కాపర్లు సమీప సురక్షిత ప్రదేశాల్లో ఉండాలన్నారు. ఎత్తైన చెట్లు కింద ఉండరాదన్నారు. ఉప్పుటేరు తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని వీఆర్వోలకు సూచించారు.

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే కామినేని


మంత్రి లోకేశ్‌కు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న కామినేని

కైకలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విజయవాడలో లోకేశ్‌ను కలిసి పుస్తకాలను, పెన్నులను అందజేశారు. విద్యా శాఖలో వినూత్నమైన మార్పులు తీసుకువచ్చి ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేలు అందజేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా రాజముద్రతో ఏర్పాటు చేసిన పుస్తకాలు, యూనిఫాం, సకల సౌకర్యాలను అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గ రాజకీయ పరిణామాలపై లోకేశ్‌తో చర్చించినట్లు తెలిపారు.

స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా రాజేష్


నియామకపత్రం అందుకుంటున్న రాజేష్

నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం నూజివీడు క్యాంపస్‌లో డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా రాజేష్ నియమితులయ్యారు. ఆంగ్ల శాఖలో ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్. రాజేష్‌ను డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాయ్స్)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ బాధ్యతలో రాజేష్ ఒక ఏడాది పాటు కొనసాగుతారు. బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌ను సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, నూజివీడు క్యాంపస్ పరిపాలనాధికారి బి. లక్ష్మణరావు, డీన్ ఎస్. చిరంజీవి, చీఫ్ వార్డెన్ బి. సురేష్‌బాబు, పూర్వ డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ జాడ సీతాపతిరావు తదితరులు అభినందించారు.

మంత్రి పార్థసారథి పరామర్శ



నూజివీడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పాలడుగు వెంకటరావు కుటుంబీకులను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. పాలడుగు నివాసానికి వెళ్లిన మంత్రి పార్థసారథి తన రాజకీయ గురువు వెంకట్రావు సతీమణి సుశీల ఆరోగ్యంపై ఆరాతీసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేత జి రాజు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పాలకులు మద్దతు పలకడం దారుణమన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. 8 గంటల పని విధానం అమలు కావాలని, కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఎన్ఆర్ హనుమాన్లు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పేదల సేవకు సహకార బ్యాంకులు పటిష్ఠం కావాలి


సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు

నూజివీడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే కో-ఆపరేటివ్ బ్యాంకుల పటిష్ఠం కావాలని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ పూర్వపు ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు పేర్కొన్నారు. నూజివీడులో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 56వ శాఖ ప్రారంభ కార్యక్రమం ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మానం మాట్లాడుతూ సామాన్యులు తమ కాళ్ళపై తాము నిలబడటానికి ఈ కో-ఆపరేటివ్ బ్యాంకులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుత ఛైర్మన్ రాఘవేంద్రరావు బ్యాంక్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. కృష్ణ మిల్క్ డెయిరీ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, గుత్తి కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు జిలాని, తణుకు కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ వెంకటరత్నం, శారదాంబ, మహిళా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ కుసుమ లావణ్య, సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు రంగరాజు, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జేవీవీ సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పీ-4లో భాగంగా ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పీ-4లో భాగంగా మండల వెంకటరామయ్య తుక్కులూరు గ్రామ పరిధిలోని పేద విద్యార్థులకు రూ. 40 వేలు, వృద్ధాశ్రమంలో వీల్ ఛైర్స్ కోసం రూ.30 వేలు అందించారు. ఈ సందర్భంగా పీ-4 కోఆర్డినేటర్ బి. సుబ్బారావు మాట్లాడుతూ స్వయంగా సీఎం చంద్రబాబు పేదల అభ్యున్నతికి పిలుపునివ్వడంతో మండవ ఫౌండేషన్ ద్వారా మండల వెంకటరామయ్య వారి తనయులు ప్రభాకర్ రావు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పేద కుటుంబాలలోని వారు చిరు వ్యాపారులు చేసుకునేందుకు, వారి చిన్నారుల చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు.



ప్రతిభావంతురాలికి ప్రోత్సాహం

ఆగిరిపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జెడ్పీ హెచ్ ఆగిరిపల్లి పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో నక్క హేమ నాగత్రివేణి 582 మార్కులు సాధించినది. అత్యధిక మార్కులు సాధించిన త్రివేణికి ప్రోత్సాహక బహుమతిగా రూ.28,000, నూతన వస్త్రాలను అందించామని ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

తల్లికి వందనం సంబరాలు


కోటపాడులో సీఎం చంద్రబాబు, మంత్రి సారథి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న చిన్నారులు

చాట్రాయి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో విద్యార్థులు, కూటమి నాయకులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేస్తుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. కోటపాడులో సీకే పాడు నీటి సంఘం అధ్యక్షుడు మంచిన పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, మంత్రి కొలుసు పార్థసారథి చిత్రపటాలకు విద్యార్థులు పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. మండలంలో అర్హులైన విద్యార్థులు 5866 మంది ఉన్నారని ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు.

ముసునూరు: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా విడుదల చేసిన నగదు శుక్రవారం తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. ఒక్క కుటుంబంలో చదువుకుంటున్న ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి నగదు జమ అయింది. మండల వ్యాప్తంగా అర్హులుగా ఉన్న 6810 మంది విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో 8 కోట్ల 85 లక్షల 30వేలు నగదు జమ అయింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగిరిపల్లి: ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం నిధులు విద్యార్థుల తల్లుల, సంరక్షకుల ఖాతాల్లో శుక్రవారం జమ చేశారు. తల్లి ఖాతాలో సొమ్ము జమయిం దంటూ బ్యాంక్ నుంచి మొబైల్‌కు సందేశం రావడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా కొన్ని చోట్ల ముగ్గురు ఉన్న పిల్లలకు ఒకరికి జమ య్యాయి. మిగతా పిల్లలకు కూడా త్వరలోనే జమవుతాయని, సాంకేతిక కారణాలతో ఇలా జరిగి ఉండవచ్చని ఎంఈవో తెలిపారు.

ముదినేపల్లి: మండలంలో శుక్రవారం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు మెస్సేజ్‌లు రావడం ప్రారంభమైంది. మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 3362 మంది విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 4458 మంది విద్యార్థులకు సుమారు రూ. 10 కోట్లు వారి తల్లుల ఖాతాలకు జమ కానున్నట్లు ఎంఈవో నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం చదివే సుమారు 400 మంది విద్యార్థులకు తల్లికి వందనం సొమ్ము జమ కానున్నట్లు తెలిపారు. ముగ్గురు నుంచి ఐదుగురు పిల్లలు ఉన్న కుటుంబాలు మండలంలో వందకుపైగా ఉండవచ్చునని సమాచారం. కాగా సప్తగిరి బ్యాంకులో పలువురి తల్లుల ఖాతాలకు సొమ్ము జమ అయినట్లు తెలిసింది.

ప్రొటోకాల్ రగడ

ఎంపీపీ, జడ్పీటీసీ, సభ్యుల వాకౌట్
వాడీవేడిగా ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ప్రొటోకాల్ విషయమై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

ముదినేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రజా ప్రతినిధుల నిరసనల మధ్య వాగ్వాదాలతో వేడెక్కి రసాభాసగా మారింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశం ఎటువంటి చర్చ లేకుండానే రద్దయింది. పలు అంశాలపై అధికారులతో వాగ్వాదానికి దిగిన సందర్భంలో ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మతో పాటు ఎంపీటీసీలు, వైసీపీ సర్పంచులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ప్రొటోకాల్ విషయమై సభ్యులు అధికారులపై విమర్శలు గుప్పించారు. మండలంలో ఎటువంటి అధికారిక కార్యక్రమం జరిగినా ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీలకు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లకు ఆహ్వానాలు ఎందుకు పంపడం లేదని ప్రశ్నిస్తూ ప్రొటోకాల్ విషయం మీకు తెలియదా అని ఎంపీడీవోను సభ్యులు నిలదీశారు. ఈ నెల 11న ముదినేపల్లిలో సాక్షాత్తు ఎంపీ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తమనెందుకు పిలవ లేదని ఎంపీపీ, పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించగా ఆ సమావేశానికి తాము కూడా ఆహ్వానితులమేనని ఎంపీడీవో వై రామకృష్ణ తెలిపారు. చాలా గ్రామాల్లో సర్పంచులను కూడా పిలవక పోవడం దురదృష్టకరమని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేయగా జిల్లా పరిషత్‌కు సంబంధించి మండలంలో జరుగుతున్న అధికారిక కార్యక్రమాలకు తనను పిలవడం లేదని జడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ పాలకవర్గాన్ని వివిధ శాఖల అధికారులు చులకనగా చూస్తున్నారని విమర్శిస్తూ మండలంలో 9 మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలను డిగ్రేడ్ చేశారని తమను ఎందుకు సంప్రదించలేదని ఎంఇవో నరేష్‌కుమార్‌ను ఎంపీపీ నిలదీశారు. రద్దయిన యూపీ పాఠశాలల విద్యార్థులు దూరంలో ఉన్న హైస్కూళ్ళకు ఎలా వెళ్ళగలరని అన్నారు. కొన్ని శాఖల అధికారులు అసలు సమావేశాలకే హాజరు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నిసార్లు చెప్పినా తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారని ఎంపీపీ విమర్శించారు. పలు అంశాలపై ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్న పరిస్థితుల్లో సమావేశం నుంచి ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు పలువురు సభ్యులు వాకౌట్ చేశారు. తహసీల్దార్ లతీఫ్ పాషా పాల్గొన్నారు.

భారీ వర్షం

మండవల్లి జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం తెల్లవారు నుంచి ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. మండవల్లిలో 10.4మి.మీ వర్షపాతం నమోదైందని ఎమ్మార్వో గోపాల్ తెలిపారు. భారీ వర్షం కారణంగా రెవెన్యూ కార్యాలయం సమీపాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలం, మండవల్లి సెంటర్ సమీపంలో 165వ జాతీయ రహదారి, పలుచోట్ల పల్లపు ప్రాంతాలు, డ్రైనేజీలు, కాల్వలు జలమయ్యాయి. వర్షం పడటంతో వ్యవసాయ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గురువారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముదినేపల్లిలోని జాతీయ రహదారితో పాటు పలు అంతర్గత రోడ్లు కూడా పెద్ద ఎత్తున జలమయం అయ్యాయి. ముదినేపల్లి, గుడివాడ జాతీయ రహదారిపై నీరు నిలిచి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


వార్లకోడు డ్రైన్ తవ్వకం పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం

డ్రైన్ తవ్వకానికి సహకరించండి

కైకలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వార్లకోడు డ్రైన్ అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం కోరారు. శుక్రవారం కైకలూరు, అటపాకలో వార్లకోడు తవ్వకాలను ఆయన పరిశీలించారు. వార్లకోడు ఇరువైపులా ఉన్న రైతులు, నివాస గృహాల ప్రజలు తవ్వకాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని లేకుంటే వర్షాకాలంలో ఎగువ ప్రాంతం ముంపునకు గురవుతుందని అన్నారు. ముందస్తుగా డ్రైన్ల తవ్వకాలతోనే ముంపు నివారణ సాధ్యపడుతుందని ప్రజలు సహకరించాలన్నారు. వీఆర్వోలు కృష్ణ, సాయి, డ్రైనేజీ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు యోగితాంజలి



ఆగిరిపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లికి చెందిన యోగితాంజలి పుదుచ్చేరి జవహర్ నవోదయకు ఎంపికైంది. 10వ తరగతి నందు 461 మార్కులు సాధించింది. జవహర్ నవోదయ విద్యాలయాలలో 10వ తరగతి నందు ప్రతిభ కలిగిన విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్లస్ 1, ప్లస్ 2, ఐఐటి కోచింగ్‌కు ఎంపికైంది.

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు

15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు అపహరణ



ఏలూరు క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనం కోసం కుటుంబంతో సహా ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటిని దోచేశారు. ఏలూరు దక్షిణపువీధికి చెందిన ఇన్నమూరి భాస్కరరావు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి కలిసి జీవిస్తున్నారు. ఆయన గడియారస్తంభం వద్ద ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్ షాపును నిర్వహి స్తున్నారు. ఈనెల 8న ఇంటికి తాళాలు వేసి కుటుంబం మొత్తం మొక్కు తీర్చుకోవడానికి తిరుపతి వెళ్లి దర్శనాలు పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపు గడియ తీసి ఉంది. బీరువాను పగులగొట్టి 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు దొంగలు అపహరించుకు పోయారు. వెండి వస్తువులు, చిల్లర నగదును ఇంట్లో మంచంపై చెల్లాచెదురుగా పడవేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ జి.సత్యనారాయణ, ఎస్ఐ మదీనాబాషా వారి సిబ్బంది, క్లూస్ టీమ్, పోలీసు జాగిలం బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అదేమార్గంలో వెళ్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దొంగ తనం ఘటన తెలుసుకుని వారిని పరామర్శించి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని, దొంగలను అరెస్టు చేసి సొత్తు రికవరీ చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డీ గ్రేడైన యూపీ పాఠశాలల నుంచి హైస్కూళ్లకు..

కోడూరులో టీసీలు తీసుకునేందుకు తల్లిదండ్రులు నిరాకరణ


డీగ్రేడ్ అయిన కొరగుంటపాలెం యూపీ పాఠశాల నుంచి టీసీలు తీసుకున్న విద్యార్థులు

ముదినేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో ముదినేపల్లి మండలంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా డి గ్రేడ్ అయిన మండల పరిషత్తు యుపి పాఠశాలల విద్యార్థులు గత్యంతరం లేని పరిస్థితులో దూరంగా ఉన్న జిల్లా పరిషత్ హైస్కూళ్లలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. హైస్కూళ్లలో 6, 7, 8 తరగతుల్లో చేరేందుకు రద్దయిన యుపి స్కూళ్ల నుంచి శుక్రవారం టీసీలు తీసుకోవటం ప్రారంభించారు. మండలంలోని కోడూరు, చేవూరు, కాకరవాడ, దాకరం, చినకామనపూడి, కొరగుంటపాలెం, వణుదుర్రు, దేవపూడి, వాడవల్లి యూపీ పాఠశాలలు డీ గ్రేడ్ కావటంతో ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదు తరగతులు మాత్రమే ఉంటాయి. ఇప్పటి వరకు ఆ పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదివిన విద్యార్థులు కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లు, ప్రైవేట్ పాఠశాలల్లో పై తరగతుల్లో చేరేందుకు ఇబ్బందులు ఉన్నా టీసీలు తీసుకుంటున్నారు. పై తొమ్మిది పాఠశాలలకు చెందిన 179 మంది విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న హైస్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కోడూరులో నిరాకరణ..

కోడూరు యూపీ పాఠశాల బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మారినందున 6, 7 తరగతుల విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలకు టీసీలు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. మా పిల్లల చదువులనైనా మాన్పిస్తాం కానీ పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాలపర్రు, ముదినేపల్లి హైస్కూళ్లకు పంపలేమని హెచ్ఎంను శుక్రవారం కలసి తెగేసి చెప్పారు. టీసీలు కూడా తీసుకోమని, కోడూరు యుపి పాఠశాలను కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు.

నేడు, రేపు
విద్యుత్ సరఫరాలో అంతరాయం

కైకలూరు/ముదినేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 తేదీల్లో గుడివాడ, చిగురుకోట విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయవాడ ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఎస్. కోటేశ్వరరావు తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతులు నిర్వహిస్తున్నందున గుడివాడ, చిగురుకోట ప్రాంతాల్లో ఉపకేంద్రాల్లో ప్రణాళికబద్ధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే కైకలూరు విద్యుత్ ఉప కేంద్రంలో 14న సాధారణ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని గుడివాడ ఈఈ జిబి శ్రీనివాస్ కోరారు.

విద్యుత్ మీటర్ల అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలి

కలిదిండి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గృహాల విద్యుత్ మీటర్ల అదనపు లోడును వినియోగదారులు క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ జీజీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిలో వాట్‌కి రూ.2 వేలకు గాను రూ.1000 చెల్లించి 50 శాతం రాయితీ పొందాలన్నారు. జూన్ 30వ తేదీ వరకు మాత్రమే విద్యుత్ రాయితీ వర్తిస్తుందన్నారు. ఇంటికి ఒక విద్యుత్ మీటరు మాత్రమే ఉండాలన్నారు. రెండు మీటర్లు ఉంటే రూ.36 వేలు వరకు జరిమానా విధిస్తామన్నారు. ఇంట్లో ఒక కుటుంబం నివశిస్తూ రెండు మీటర్లు ఉంటే రెండో మీటరును విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే అప్పగించాలన్నారు.

22 తరువాత చర్చకు సిద్ధం..
మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపై చర్చకు రమ్మంటూ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొనడం నిజమైతే తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని నూజివీడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గురువారం నూజివీడు గాంధీ బొమ్మల సెంటర్‌లో జరిగిన కూటమి సంబరాల్లో పాల్గొన్న మంత్రి పార్థసారథి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి.. వైసీపీ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిపై చర్చకు వస్తారా అంటూ పేర్కొనడంపై మాజీ ఎమ్మెల్యే అప్పారావు స్పందించారు. ఈ నెల 22న తేదీ తరువాత ఎప్పుడైనా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

మా పిల్లలకీ పథకాలివ్వండి: అంగన్వాడీలు

ముసునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు ప్రభుత్వం తక్షణమే సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ముసునూరు తహసీల్దార్ కేవీ రమణకు శుక్రవారం అంగన్‌వాడీలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 12 వేలు లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే అంగన్‌వాడీ వర్కర్‌కు రూ. 11,500, హెల్పర్, మినీ వర్కర్‌కు రూ. 7 వేలు గౌరవ వేతనంగా ఇస్తున్నారని, అయితే అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులుగా నమోయ్యారని సంక్షేమ పథకాలు అమలు చేయక పోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పి.రాజకుమారి, కె.విద్యావతి, మేరి సులోచన, పి.రమాదేవి పాల్గొన్నారు.



విగ్రహాల వితరణ

కైకలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కైకలూరు చిన్నచెరువుగట్టుపై గల శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీ కోదండ రామస్వామి వారికి ఉత్సవ విగ్రహాలను కైకలూరుకు చెందిన దాత శుక్రవారం అందజేశారు. కైకలూరుకు చెందిన దివంగత గుత్తా సుబ్బారావు, సావిత్రి స్మృత్యర్థం వారి కుమార్తె సీతారామలక్ష్మణ, హనుమంతుని ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. శనివారం ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు విశేషపూజలు నిర్వహిస్తారు. భక్తులంతా తరలి రావాలని కమిటీ సభ్యులు కోరారు.

తల్లికి ఆనందం

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేకించి గతంతో పోల్చితే ఈసారి సొమ్ములు అందుకున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో అమ్మఒడి పథకంలో నాలుగేళ్ల పాటు 1,78,214 మంది విద్యార్థుల తల్లులకే సొమ్ములు జమ చేశారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒకే ఇంటిలో చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం వర్తింపు చేస్తామని ఎన్నికల హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడంతో ఆ మేరకు విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. సుమారు 2,15,082 మంది విద్యార్థులకు రూ.13 వేలు చొప్పున చేతికి అందినట్లయింది. గత ప్రభుత్వంలో సొమ్ములు అందుకున్న విద్యార్థుల సంఖ్యకు ఇప్పటికి దాదాపు అధికంగా ఉన్నట్లయింది. జిల్లాలో ఎక్కడ చూసినా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో సంతోషం వ్యక్తమైంది. కొందరు నేరుగా ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరికొందరు తమ పిల్లలను అక్కున చేర్చుకుని సంతోషపడ్డారు.

తల్లుల ఖాతాల్లో అత్యధికులకు నగదు జమయ్యాయి. మరి మా సంగతి ఏమిటి, జిల్లా వ్యాప్తంగా ముగ్గురు లేదా ఇద్దరున్న కుటుంబాల్లో కొందరికి సొమ్ము జమ కాలేదు. కొన్ని మండలాల్లో అందరికీ సొమ్ము అందగా లింగంపాలెం, ఇతర మండలాల్లో మాత్రం శుక్రవారం పొద్దుపోయే వరకూ ఖాతాల్లో జమ కాకపోవడంతో తల్లుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ దీనికి సంబంధించి అధికారులు కూడా ఎటువంటి వివరణలతో ముందుకు రాకపోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదంతా సోమవారం నాటికి సర్దుబాటవుతుందంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆనందంగా ఉంది..

కొయ్యలగూడెం: చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం డబ్బులు వేయడం ఆనందంగా ఉందని కన్నాపురం గ్రామానికి చెందిన తండ్రి నులకాని ప్రసాద్ అన్నారు. ప్రసాద్‌కు నలుగురు పిల్లలు కాగా ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు రూ.39 వేలు పడ్డాయి. సాయి దుర్గ జడ్పీ పాఠశాలలో 7వ తరగతి, శ్రీరుతిక ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి, లక్ష్మీ 3వ తరగతి చదువుతున్నారు. ముగ్గురికి ఒకేరోజు డబ్బులు పడటంతో ఆ కుటుంబం ఎంతో ఆనందనం వ్యక్తం చేశారు.


చిలుకూరి యామినీ ఉమా భారతి కుటుంబం

సంతోషంగా ఉంది

మాకు ఒక బాబు, ఇద్దరు కవల ఆడ పిల్లలు. శుక్రవారం తల్లికి వందనం నగదు రూ.39 వేలు నా ఖాతాలో జమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో ఒకరికే అమ్మఒడి వేశారు. అదీ ఒక ఏడాదే వచ్చింది. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మా ముగ్గురి పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపచేయడం సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు. **-చిలుకూరి యామినీ ఉమాభారతి, జంగారెడ్డిగూడెం**

కూటమికి ధన్యవాదాలు

మాకు ముగ్గురు ఆడపిల్లలు. ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం నగదు రూ.39 వేలు నా ఖాతాలో జమ కావడం సంతోషంగా ఉంది. అన్న మాట ప్రకారం డబ్బు ఇచిచ్చన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు. పిల్లలకు పుస్తకాలు, ఫీజులు చెల్లిస్తాం. విద్యా సంవత్సరం ప్రారంభంలో నగదు జమ చేయడం ఎంతో ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-కామన శ్రీలక్ష్మి, జంగారెడ్డిగూడెం


తన ముగ్గురు పిల్లలతో కామన లక్ష్మి